రంజాన్ వేళలు		
	ఇఫ్తార్ (బుధ)	సా.6.21
	సహరి (గురు)	ఉ.4.52

శతమానం భవతి..

శతమానం భవతి.. అంటే వందేళ్లు కలిసిమెలిసి హాయిగా.. ఆనందంగా జీవించమని అర్థం.. ప్రతి పెళ్లిలోనూ ఈ మాట వినిపించక మానదు.. అయితే ఈ చిత్రంలో జంటను చూశారా.. గత వందరోజులుగా ఏదో ఒక చోట శతమానంభవతి అనిపించుకుంటున్నారు.. అయితే వంద రోజులు పెళ్లి చేసుకుంటున్నారా అనొద్దు.. వీరిద్దరి నిశ్చితార్థం నుంచి పెళ్లి వరకూ వంద రోజులు సమయం వచ్చింది.. ఫోన్‌లో చాటింగ్‌లతో కాలం వృథా చేయడం ఎందుకు అనుకున్నారు.. ప్రతిరోజూ ఏదో ఒకచోట సాయం చేస్తూ ముందుకు సాగుతున్నారు.. బుధవారం రావులపాలెంలో సీఆర్‌సీ వేదికగా ఈ జంట ఒక్కటవుతున్నారు.. వీరిని మనం కూడా శతమానంభవతి అని దీవించేద్దామా...!



6

‘తూర్పు’న కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటుచేయాలి

లోక్‌సభలో ఎంపీ పురందేశ్వరి



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యేక కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లోక్‌సభలో మంగళవారం కొబ్బరి రైతుల సమస్యలను పురందేశ్వరి ప్రస్తావించారు. రాజమండ్రి కేంద్రంగా కొబ్బరి బోర్డు ఏర్పాటుచేస్తే రాష్ట్రంలోని రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కొబ్బరిసాగులో ఆంధ్ర ప్రదేశ్ నాల్గవ స్థానంలో ఉందన్నారు. ప్రధానంగా కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో 1.23 లక్షల హెక్టార్లలో కొబ్బరి తోటలు ఉన్నాయన్నారు. 1981లో ఏర్పాటైన కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రధాన కార్యాలయం కేరళలో ఉండడం ప్రాంతీయ కార్యాలయాలు ఆంధ్రప్రదేశ్‌కు దూరంగా ఉండడంతో రైతులు సకాలంలో సలహాలను పొందడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల కొబ్బ రికి వచ్చిన తీవ్రమైన ముప్పులను పరిశీలిస్తే కొబ్బరి బోర్డు దగ్గరలోనే ఉండాలన్న తక్షణ అవసరాన్ని తెలియజేస్తున్నదన్నారు. ఏపీ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ‘తూర్పు’న ప్రత్యేక కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయం ఏర్పాటుచేయాలని కోరారు.

ఏపీలో కంప్రెస్డ్ బయో గ్యాస్ పరిస్థితి ఏంటి?

రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు



కాకినాడ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పెట్రోలియం, నేచురల్ గ్యాస్‌కు సంబంధించి కంప్రెస్ట్ బయో గ్యాస్ (సీబీజీ) పైప్‌లైన్ మౌలిక సదుపాయాలకు ఎటువంటి లక్ష్యాలను నిర్దేశించిందని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు ప్రశ్నించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం పలు అంశాలు లేవనెత్తారు. ఏపీలో ఈ పథకం అమలు స్థితి, కాకినాడ జిల్లాలో గ్యాస్ పంపిణీ నెట్‌వర్క్ ద్వారా లబ్ధిదారుల వివరాలు కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హరిదీప్‌సింగ్ పూరి కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్లను సీజీడీ నెట్ వర్క్‌కు అనుసంధానానికి రూ.994.50 కోట్ల నిధులతో 100 ప్రాజెక్టులు చేపట్టడం జరిగిందన్నారు. గతేడాది చివరికి రాష్ట్రంలో 246 సీఎన్‌జీ స్టేషన్లకు కాకినాడలో 13 స్టేషన్లు, 2,91,383 డొమెస్టిక్ కనెక్షన్లకు కాకినాడలో 66,301 కనెక్షన్లు ఇచ్చారని వివరించారు. పరిశ్రమల స్థాపన, ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, ఉద్యోగావకాశాలు పెంపు లక్ష్యాలపైనా సానా ప్రశ్నించారు.

ఓమ్మై.. గాడ్!



నామినేటెడ్ పదవులకు తీవ్రపోటీ

- ఉమ్మడి జిల్లాలో 1713 ఆలయాలు
- పెద్ద ఆలయ బోర్డులకు డిమాండ్
- వాడపల్లి ఆలయంపై ప్రధాన దృష్టి
- పోటీపడుతున్న కూటమి నేతలు
- ప్రముఖ ఆలయాల్లోనూ ఇంతే
- నియోజకవర్గాల వారీ కసరత్తు
- పెరుగుతున్న ఆశావహులు
- కొన్ని కుర్చీలపై కర్చీఫ్‌లు
- ద్వితీయస్థాయి నేతల పైరవీలు

(రాజమహేంద్రవరం/అమలాపురం - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో నామినేటెడ్ పోస్టులకు ఆశావహులు పెరుగుతున్నారు. ఇప్పటినుంచే ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల ముందు క్యూకడుతున్నారు. పోస్టులు ఇప్పించాలని కోరుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వమేర్పడి పది నెలలు కావస్తుండడంతో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న కూటమి నాయకులు ఊహల పల్లకిలో విహరిస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశం కల్పించాలంటూ నియోజకవర్గ ఎమ్మెల్యేల ద్వారా పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఆర్థిక స్థోమత కలిగిన మరికొందరు వ్యూహాత్మకంగా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.ఈ నెలాఖరుకి లేదా ఏప్రిల్ చివరికి వేలాది మంది కూటమి నేతలు, కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు దక్కనున్నాయి.



పోస్టుల భర్తీపై సీఎం సమీక్ష



నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఇటీవల సీఎం నారా చంద్రబాబునాయుడు అమరావతిలో ముఖ్య నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు. మార్చి నెలాఖరుకు నియోజక వర్గస్థాయిలో ఉన్న మార్కెట్ కమిటీలు, దేవస్థానాలు, ఇతర కమిటీల్లో నియామకాలను పూర్తి చేస్తామని ప్రకటించారు. సొసైటీలకు పాలకవర్గాలు, డీసీసీబీ కమిటీలకు సభ్యుల నియామకాన్ని పూర్తిచేసే యోచన ఉంది.

కత్తిమీద సాములా..

ఈనెల 14వ తేదీన పిఠాపురం కేంద్రంగా జనసేన రాష్ట్ర స్థాయి ప్లీనరీ నిర్వహణకు ఆ పార్టీ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్లీనరీలో చర్చనీయాంశంగా నామినేటెడ్ పదవులపై చర్చ జరగొచ్చని జనసేన వర్గాల్లో వినిపిస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నాయకత్వం వద్ద తమకు తగిన గుర్తింపు లభించడం లేదనే అంశాన్ని లేవనెత్తడం ద్వారా ప్రభుత్వం భర్తీ చేసే నామినేటెడ్ పోస్టుల్లో అగ్రతాంబూలం కల్పించాలనే ఒత్తిడి పెంచనున్నట్టు సమాచారం. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు పడి పార్టీ కోసం కష్టపడ్డ కేడర్‌ను కాదని.. ఎన్నికల సమయంలో వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలోకి చేరిన కొందరు నాయకులకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రాధాన్యం కల్పిస్తున్నారంటూ ఇప్పటికే ఆయా కేడర్లు ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నాయి. రాజోలు నియోజకవర్గంలో నిజమైన జనసేన శ్రేణులకు అన్యాయం జరుగుతోందని, వైసీపీ నుంచి వచ్చినవారికే పెద్దపీట వేస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు హల్‌చల్ చేస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వానికి నామినేటెడ్ పోస్టుల భర్తీ కత్తిమీద సాములాగే ఉంది

ఆలయ కమిటీల సందడి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు కమిటీలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే గుర్తింపు పొందిన దేవాలయాలు 1713కు పైగా ఉన్నాయి. అన్నవరం, వాడపల్లి, పిఠాపురం, సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయం, ద్రాక్షారామ, అయినవిల్లి, కోటసత్తెమ్మ, అంతర్వేది, అప్పనపల్లి, రాజమహేంద్రవరంలో కోటిలింగేశ్వరస్వామి, ఉమా మార్కెండేయస్వామి వంటి అనేక పెద్ద దేవాలయాలు ఉన్నాయి. గత వైసీపీ హయాంలో ఏం జరిగిందో కానీ రూ.5 లక్షల ఆదాయంకంటే తక్కువ ఉన్న దేవాలయాలకు ట్రస్ట్‌బోర్డుల నియామకం వద్దని అప్పట్లో సుప్రీంకోర్టు ఆర్డర్ ఇచ్చింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో 627 వరకూ ఉంటాయి. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని రూ.5లక్షల్లోపు ఆదాయం ఉన్నవాటిని పరిగణనలోకి తీసుకునేటట్టు కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకుంటే 1713 దేవాలయాలకు కమిటీలను నియమించవచ్చు. ప్రస్తుతం ఐదు లక్షలకంటే ఎక్కువ వార్షికాదాయం ఉన్న సుమారు 590 దేవాలయాలకు మాత్రం కమిటీలను వేసే ఆలోచన జరుగుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో రూ.7.5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం కలవి 127 ఉన్నాయి. ఇవికాకుండా తక్కువ ఆదాయం గలవి 68 వరకూ ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవి 226, రూ.కోట్లలో ఆదాయం ఉన్నవి 19 ఉన్నాయి. మొత్తం అన్ని రకాలు కలిసి 611 ఉన్నాయి. కాకినాడ జిల్లాలో ఐదు లక్షలకంటే ఎక్కువ ఆదాయం కలవి 200, పెద్దవి 11 ఉన్నాయి. అన్ని రకాలు కలిపి 900 ఉన్నాయి. గత నెలలో సీఎం చంద్రబాబు స్వయంగా ఈ కమిటీలకు పేర్లను ప్రతిపాదించాలని ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలకు సూచించిన సంగతి తెలిసిందే. దీంతో సందడి మొదలైంది.

ఏఎంసీలు.. కార్పొరేషన్లు

మార్కెట్ కమిటీల చైర్మన్ల పదవులకు ఇప్పటికే రిజర్వేషన్ ప్రక్రియ ప్రకారం ఏయే సామాజిక వర్గానికి ఏయే మార్కెట్ కమిటీ ఇవ్వాలనేది నిర్ణయించారు. దాంతో ఎమ్మెల్యేలు కొంత మందికి ముందుగానే అభయహస్తం ఇవ్వడంతో వారి స్థానే భార్యల పేర్లు గానీ, ఇతరుల పేర్లను ప్రతిపాదించడానికి రకరకాల సమస్యలు ఇబ్బందికరంగా మారాయి. ఇక ప్రభుత్వం కొన్ని కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించినప్పటికీ డైరెక్టర్లను నియమించకపోవడంతో వాటికి ఆశావహులు పైరవీలు ప్రారంభించారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన కీలక నాయకులు తమకు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల స్థానాలు కల్పించాలంటూ ఒత్తిడి పెంచారు. ఈసారి పదవుల భర్తీలో జనసేనకు ప్రాధాన్యత ఇవ్వకపోతే నియోజకవర్గాల స్థాయిలో ఇబ్బంది వచ్చే పరిస్థితి ఉన్నందున వారిని, అటు బీజేపీని సమన్వయం చేసుకుంటూ పదవులు ఇవ్వాల్సి ఉంది.

నాయకులకు పెను సవాల్..

కీలక దేవస్థానాలకు పాలకమండళ్ల నియామకం సవాళ్లుగా మారుతున్నాయి. ఉదాహరణకు కోనసీమ జిల్లాలో వాడపల్లి, అంతర్వేది, అయినవిల్లి, మురమళ్ల, అప్పనపల్లితోపాటు వివిధ ఆలయాలకు పాలకమండళ్లను నియమించడం ఎమ్మెల్యేలకు శిరోభారంగా మారింది. వీటిలో ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గానికి విపరీతమైన డిమాండ్ ఉండడంతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు. ఇదే తరహా పరిస్థితులు అన్ని నియోజకవర్గాల్లోను నెలకొన్నాయి.

ఒక్కో ట్రస్ట్‌బోర్డుకు 11 మంది

ఒక్కో దేవాలయానికి 11 మంది ట్రస్ట్‌బోర్డు సభ్యులను ప్రభుత్వం నియమించనుంది. చైర్మన్‌తో పాటు 10 మంది సభ్యులు ఉం టారు. దీనివల్ల వేలాది మంది కార్యకర్తలకు పదవులు దక్కనున్నాయి. మూడు పార్టీల నాయకులు అధిష్ఠానం ఆదేశాల మేరకు పంచుకుంటారు. ఈ సారి ట్రస్ట్‌బోర్డుల్లో 50 శాతం మహిళా సభ్యులను నియమించనున్నారు.ఈసారి కొత్తగా నాయీ బ్రాహ్మణులు ఒకరు, బ్రాహ్మణ వర్గానికి చెందిన వారు ఒకరికి తప్పనిసరిగా స్థానం కలిగించేటట్టు ప్రభుత్వం చట్టం చేసింది.మిగిలిన 50 శాతం జనరల్ కేటగిరీలో ఉంటాయి. ప్రతి కమిటీలోనూ ఆలయ పూజారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు.

మద్యం తాగేవాళ్లకు నోచాన్స్

దేవాలయ ట్రస్ట్ బోర్డు కమిటీల్లో మందుతాగే అలవాటు ఉన్నవారికి అవకాశం లేదు. ముఖ్యంగా హిందువై ఉండాలి. కనీసం 25 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. దేవుడిపై విశ్వాసం ఉండాలి. క్రిమినల్ కేసులు ఉండకూడదు. ఎండోమెంట్ భూములు లీజుకు తీసుకుని ఉండకూడదు. బకాయిలు ఉండకూడదు. వారి బంధువులు లీజుదారులై ఉండకూడదు. ఐపీ పెట్టినవారు, కుష్టువ్యాధిగ్రస్తులూ అనర్హులే. ట్రస్ట్ బోర్డులో సభ్యులెవరికీ గౌరవ వేతనం ఉండదు. ఆలయ అభివృద్ధికి, దేవునికి సేవ చేయడమే ప్రధాన లక్ష్యం.

సౌర.. సా..గు!



- కరెంట్ కష్టం తీరనుంది
- రైతులకు తీపికబురు
- పగటిపూటే 9 గంటలు విద్యుత్
- 176 కోట్లతో సోలార్ ప్లాంట్లు
- తూర్పు, కాకినాడల్లో ఏర్పాటు
- కోనసీమలో స్థల ఇబ్బంది
- ఏటా రూ.275 కోట్లు ఆదా

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాతలకు ఇకపై వ్యవసాయానికి విద్యుత్ బెంగ తీరనుంది. త్వరలో తొమ్మిది గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ వాడుకునే రోజులు రాబోతున్నాయి. ఈ మేరకు ట్రాన్స్‌కో రూ.176 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించబోతోంది. దీని ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను కేవలం పగటి పూట రైతులు వాడుకునేందుకు మాత్రమే సరఫరా చేయనుంది. తద్వారా రైతులు విద్యుత్ కోసం రాత్రి వేళల్లో పడిగాపులు కాసే పరిస్థితులు తప్పనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 67 వేల కనెక్షన్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాపై వ్యవసాయంపై ఆధారపడి ఎక్కువ మంది జీవిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు 68 వేల వరకు ఉన్నాయి. సాగుకోసం పక్కాగా విద్యుత్ వినియోగిస్తోన్న కనెక్షన్లు 47 వేలు ఉన్నాయి. వీరికి ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఉమ్మడి జిల్లాకు 2.99 లక్షల కిలోవాట్స్ లోడ్ అవసరం అవుతోంది. అంటే 493.22 మిలియన్ యూనిట్లు. ఈ మొత్తం విద్యుత్ అన్నదాతలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందుకు ఏటా రూ.275.20 కోట్ల వరకు ఆర్థిక భారం పడుతోంది. ఇంత చేసినా తీవ్ర వేసవి సమయంలో వ్యవసాయానికి సైతం కోతలు వేయాల్సిన పరిస్థితి. దీంతో పలుసార్లు పంటలు ఎండిపోయి అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు.

పోలవరం కాలువ వెంబడి..

ఇకపై సాగుకు విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకూడదనే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో ట్రాన్స్‌కో అధికారులు సోలార్ విద్యుత్‌పై దృష్టిసారించారు. పీఎం కుసుం పథకం కింద సోలార్ విద్యుత్‌ను పగటిపూట తొమ్మిది గంటలపాటు సరఫరా చేయడానికి కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌ను అనుసంధానించి దీన్ని పూర్తిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ విద్యుత్‌కు మాత్రమే సరఫరా చేయాలని నిర్ణయించారు. మొత్తం 44 మెగావాట్ల సామర్థ్యంతో 16 చోట్ల సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం మురారీ నుంచి తుని నియోజకవర్గంలోని తేటగుంట వరకు కాలువ వెంబడి 14 చోట్ల సోలార్ పవర్ ప్లాంట్లను రూ.160 కోట్లతో నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. కాలువ వెంబడి స్థలం ఐదు నుంచి పదెకరాల వరకు ఉన్న చోట్ల 8 మెగావాట్లు, తక్కువ స్థలం ఉన్నచోట్ల రెండు నుంచి నాలుగు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ప్లాంట్లను స్థాపించనున్నారు. రాజమహేంద్రవరంలో కల్వచర్ల, జీవీకే పవర్ ప్లాంట్ ఈ రెండు చోట్ల రూ.8 కోట్లతో నాలుగు మెగావాట్ల సామర్థ్యంలో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించనున్నారు. ఈ సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించి పగటి పూట 9 గంటలపాటు రైతులకు అందించనున్నారు. తద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 48 వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు లబ్ధి కలగనుంది. అటు ప్రభుత్వానికి ఏటా ఉచిత విద్యుత్‌కు అయ్యే రూ.275 కోట్లు ఖర్చు ఆదా కానుంది. ఇక కోనసీమ జిల్లాలో రెండు ప్లాంట్ల నిర్మాణానికి ప్రతిపాదనలున్నా స్థల లభ్యత కష్టంగా మారింది. తొలి విడత ఈ రెండు జిల్లాల్లో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే రైతులకు పగటిపూట తొమ్మిది గంటలపాటు ఉచిత విద్యుత్‌కు ఢోకా ఉండదు. సోలార్ విద్యుత్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 47 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు లబ్ధి కలగనుండగా, కాకినాడ జిల్లాలోనే 24 వేల మందిరైతులకు సోలార్‌తో మేలు జరగనుంది.



హాట్‌స్పాట్‌ల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు

జిల్లాలో హాట్‌స్పాట్‌లను గుర్తించండి!

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న హాట్‌స్పాట్‌లు గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లా రహదారి భద్రతా కమిటీ సభ్యులను ఆదేశించారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జిల్లాస్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లాలో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. జాతీయ రహదారులపై అవసరమైన చోట్ల వేగ నియంత్రణ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన పెంచి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పగడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. హెల్మెట్ ధరించడం వాహనదారులకు అలవాటుగా మార్చాలన్నారు. ప్రాణానికి మించిన విలువైన ఆస్తి లేదని, రహదారులపై జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోకుండా చర్యలు తీసుకుని ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందినవారి కుటుంబాలు పడుతున్న ఇబ్బందులను ప్రతీ ఒక్కరు గుర్తించాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల స్థితిగతులు, బ్లాక్‌స్పాట్‌ల వద్ద తీసుకున్న చర్యలు, రహదారి భద్రత ఉల్లంఘనలపై తీసుకున్న చర్యలపై సమావేశంలో చర్చించారు. రోడ్డు నిర్మాణ ఏజన్సీలు, ప్రతినిధులు తప్పనిసరిగా కమిటీ సమావేశాలకు హాజరుకావాలని ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో 117 రోడ్డు ప్రమాద కేసులు నమోదుకాగా 39 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అవసరమైన మేరకు స్పీడు బ్రేకర్లు, సైన్‌బోర్డులు, హెచ్చరికబోర్డులు, స్పీడ్‌లిమిట్ బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. పేరూరు, కామనగరువు, ముమ్మిడివరం జంక్షన్ల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, జాతీయ రహదారులు, భవనాలశాఖ జిల్లా అధికారి బి.రాము, సాంకేతిక నిపుణులు, ఆర్డీవోలు డి.అఖిల, పి.శ్రీకర్, జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 522 మంది గైర్హాజరు

అమలాపురం టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మంగళవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. జనరల్, ఒకేషనల్ విభాగాలకు చెందిన 13,594 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. కాగా డీఐఈవో సోమశేఖరరావు అమలాపురంలోని ప్రభుత్వ బాలికల, పరంజ్యోతి, శ్రీచైతన్య జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జనరల్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 11,984 మందికిగాను 11,462 మంది పరీక్షకు హాజరుకాగా 522 మంది గైర్హాజరయ్యారు. భౌతికశాస్త్రం పరీక్షకు 9622 మందికి 9330 మంది, అర్థశాస్త్రం పరీక్షకు 2362 మందికి 2132 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2676 మంది విద్యార్థులకుగాను 2291 మంది హాజరుకాగా 385 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు సోమశేఖరరావు తెలిపారు.

హెల్ప్‌డెస్క్ ప్రారంభించిన కలెక్టర్

విదేశాలకు వెళ్లేవారి కోసం కలెక్టరేట్‌లో విదేశీ వ్యవహారాల్లో సహాయం



కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్


అమలాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాలకోసం విదేశాలకు వెళ్లేవారికి సహాయ సహకారాలు అందించేందుకు కలెక్టరేట్‌లో విదేశీ వ్యవహారాల హెల్ప్ డెస్క్ (కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్) ఏర్పాటుచేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. విదేశాలకు వెళ్లేవారికి సౌకర్యవంతంగా ఉండేలా చూడడంతోపాటు చట్టబద్ధంగా మార్గనిర్దేశం చేసేందుకు హెల్ప్‌డెస్క్ దోహదపడుతుందన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిలతో కలిసి కలెక్టర్ హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు, ఉద్యోగాలకోసం విదేశాలకు వెళ్లేందుకు ఉన్న అవకాశాలు, పాస్‌పోర్టు, వీసాలు పొందే మార్గాలను ఈ డెస్క్ సూచిస్తుందన్నారు. సందర్శన వీసాలతో విదేశాలకు వెళ్లి ఎందరో మోసపోయారని, కొందరు వెట్టిచాకిరీ చేయాల్సిన పరిస్థితులను పరిగణలోకి తీసుకుని దీన్ని ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో హెల్ప్‌డెస్క్ నోడల్ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, సమన్వయకర్త గోళ్ల రమేష్ పాల్గొన్నారు. విదేశీ వ్యవహారాల హెల్ప్‌డెస్క్ టోల్ ఫ్రీనంబరు 1800-425-0488గా ప్రకటించారు.

రూ.766.19 కోట్ల అంచనా వ్యయంతో జాతీయ రహదారి నివేదిక

శాసనమండలిలో ఎమ్మెల్సీ ఐవీ ప్రశ్నకు మంత్రి సమాధానం



అమలాపురం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అమలాపురం నుంచి రావులపాలెం వరకు జాతీయ రహదారి నిర్మాణానికి ఏమైనా ప్రతిపాదన ఉందా అని శాసనమండలిలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) అడిగిన ప్రశ్నకు రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి సమాధానమిచ్చారు. భూసేకరణ ప్రక్రియ పనులు ఏ దశలో ఉన్నాయి, ఎంతమేర నిధులు కేటాయించారు తదితర అంశాలపై ఎమ్మెల్సీ ఐవీ ప్రశ్నించగా మంత్రి జనార్ధనరెడ్డి లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. అమలాపురం నుంచి రావులపాలెం వరకు జాతీయ రహదారి నిర్మాణానికి రూ.630 కోట్లు కేటాయించామన్నారు. గత ఏడాది ఆగస్టు 14న రాజపత్రం ద్వారా భారత ప్రభుత్వం భూ సేకరణ నిమిత్తం అమలాపురం జాయింట్ కలెక్టర్‌ను నియమించారన్నారు. ఈ నెలాఖరు నాటికి భారత ప్రభుత్వ రాజపత్రంలో రహదారి నిర్మాణాన్ని ప్రచురించే అవకాశం ఉందన్నారు. రూ.766.19 కోట్ల అంచనా వ్యయంతో పాటు వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను గత నెల 24న న్యూఢిల్లీలోని ఎంవోఆర్టీ అండ్ హెచ్‌కు సమర్పించామన్నారు. అదేవిధంగా అమలాపురం పట్టణంలో ఎర్రవంతెన, నల్లవంతెన, ఈదరపల్లి వంతెనలను ఏనాడో నిర్మించడం జరిగిందని, ప్రస్తుతం పెరిగిన జనాభాతో నిత్యం ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ వంతెనలను ఆధునికీకరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఐవీ కోరారు.



పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు నాదెండ్ల, కందుల

7

భారీ స్థాయిలో జనసేన సభకు ఏర్పాట్లు : మంత్రులు



దాక్టర్ మోహిత్
డాక్టర్ సీత

వారిద్దరూ ఫిజియోథెరపిస్టులే కాదు ఇంద్రజాలికులు కూడా. ఒకరి భావా లను మరొకరు అర్థం చేసుకుంటూ సమాజ చైతన్యానికి ఎంతగానో కృషి చేశారు. డిసెంబరు 26న నిశ్చితార్థం నుంచి మార్చి 12 వివాహ తేదీ వరకు 100 రోజుల పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వంద సేవా కార్యక్రమాలు నిర్వహించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. పేదలకు దుస్తులు, చిన్నారులకు విద్యా సామగ్రి, వైద్య సేవలు అందిస్తూ... చెట్లను పెంచడం వల్ల కలిగే మేలును వివరిస్తూ సామాజిక కార్యక్రమాలు సైతం నిర్వహించారు. వినూత్న రీతిలో వెడ్డింగ్ ప్రోమోలతో ఆకట్టుకుని నేడు పెళ్లి పీటలెక్కుతున్న ఆ యువ జంటే డాక్టర్ మోహిత్-డాక్టర్ సీత.



శుభమానంభవతి


కళ్లకు గంతలు కట్టుకుని సైకిళ్లపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న యువ జంట

నిశ్చితార్థం నుంచి పెళ్లి దాకా 'వంద' రోజులు సమాజ సేవ
యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ఫిజియోథెరపిస్టుల జంట
నేడు రావులపాలెం సీఆర్సీ వేదికగా మూడుముళ్ల బంధంతో ఒక్కటవుతున్న డాక్టర్ మోహిత్-సీత

ఆత్రేయపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలకుడు చింతా శ్యామ్ జాదూగర్ తనయుడు ఫిజియోథెరపిస్టు డాక్టర్ మోహిత్‌కృష్ణ. ఇతడికి బండారులంకకు చెందిన ఉప్పుగంటి శ్రీధర్ కుమార్తె, ఫిజియోథెరపిస్టు డాక్టర్ సాయిసీతతో గతేడాది డిసెంబరు 26న వివాహ నిశ్చితార్థం జరిగింది.
- మోహిత్ మనువాడే సీతకు కూడా ఇంద్రజాలంలో శిక్షణ ఇచ్చారు. వారిద్దరూ బ్లైండ్ ఫోల్డ్... కళ్లపై కరచీనూక వేసుకుని, కళ్లకు గంతలు కట్టుకుని సైకిల్ నడుపుతూ, బైక్ డ్రైవింగ్ చేస్తూ రహదారి భద్రతా నియమాలపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించారు.
- ఇద్దరూ ఫిజియోథెరపిస్టులు కావడంతో పేద ప్రజలకు ఆధునాతన ఫిజియోథెరపీ శిబిరాలు నిర్వహించి వైద్య సేవలందించారు.


కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పెండ్లి శుభలేఖతో పాటు మొక్క అందిస్తున్న యువ జంట

- వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలు, వలస కూలీలు, వృద్ధులు, అనాథలకు అన్న దానం, వస్త్ర దానం చేయడంతో పాటు పేద చిన్నారులకు విద్యా సామగ్రి అందించారు.
- మొక్కల ప్రాముఖ్యతను తెలియజేస్తూ రూపొందించిన వెడ్డింగ్ కార్డుతో పాటు ఒక మొక్క అందిస్తూ పెళ్లికి ఆహ్వానించారు. సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుతూ సేవా మార్గాన్ని ఎంచుకుని వినూత్న రీతిలో షూట్ చేసిన వెడ్డింగ్ ప్రోమో ఆకట్టుకుంది. కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావులకు శుభలేఖలు పంచి సేవా కార్యక్రమాలను వివరించారు.
- రావులపాలెం సీఆర్సీ వేదికపై ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్దల సమక్షంలో మోహిత్-సీత మూడుముళ్ల బంధంతో బుధవారం ఒక్కటవ్వనున్నారు. భవిష్యత్‌లో వీరు మరిన్ని సేవలందిస్తారని ఆశిస్తూ ఆశీర్వదిద్దాం.


పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తూ...


పేద మహిళకు వస్త్రాలు పంపిణీ చేస్తూ...

సేద్య ప్రయోగశాల


జీవామృతం తయారు చేస్తున్న రైతు శ్రీరామారావు

మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ సేద్యంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పద్ధతులను అవలంభిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెనికి చెందిన రైతు కోట్ల వెంకట శ్రీరామారావు (బుజ్జి) 22 ఎకరాలు సాగు చేస్తూ సేద్యంలో నూతన ఒరవడి సృష్టిస్తున్నాడు.



నిరంతర ప్రయోగాలతో నూతన ఒరవడి సృష్టిస్తున్న రైతు కోట్ల శ్రీరామారావు
కొబ్బరి తోటలో అంతర పంటల సాగుతో అధిక ఆదాయం
సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు

(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి)
కోనసీమ జిల్లాలో రైతులు కొబ్బరి తోటలో మరి ఏ ఇతర పంటలనూ సాగు చేయరు. కేవలం కొబ్బరినే సాగు చేస్తూ ఎకరాకు సంవత్సరానికి సేద్యపు ఖర్చులు పోను రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఆదాయం పొందుతారు. అయితే బుజ్జి మాత్రం కొబ్బరి తోటలో అంతర పంటలుగా ఖోఖో, వక్క, వాక్కాయ (చెర్రీ), పోకచెట్టు, మిరియాలు, గుమ్మడి టేకు, టేకు, మహాగని, అకేషియా మాంజ్యం వంటి కలపనిచ్చే వృక్షాలు సాగు చేస్తున్నాడు. దీనివల్ల కొబ్బరి చెట్లు అధిక దిగుబడి ఇవ్వడంతో పాటు అంతర పంటల వల్ల ఎకరాకు రూ.80వేల దాకా అదనపు ఆదాయం పొందుతున్నాడు.

తోటలో మొక్కలకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం సేంద్రియ ఎరువులను వాడుతూ సత్ఫలితాలు సాధిస్తున్నాడు. సేంద్రియ ఎరువులను కూడా సొంతంగానే తయారు చేసివినియోగిస్తుంటాడు. పొలంలో పచ్చిరొట్ట సాగు చేసి ఎదిగిన తర్వాత వాటిని దుక్కి దున్నుతాడు. దీనివల్ల భూసారం పెరుగుతుంది. కొబ్బరి తోటలో ఆకులు, కమ్మలు వంటి వాటిని గోతులుగా తీసి వాటిలో వేసి సేంద్రియ ఎరువును తయారు చేస్తాడు. వీటితో పాటు జీవామృతం చేసి వాటిని పొలంలో వెళ్లే సాగునీటిలో కలిసి సేంద్రియ ఎరువుగా వాడుతున్నాడు. దీని కోసం పొలంలో 500 సిమెంటు కుండీలు ఏర్పాటుచేసి ఒక్కో కుండీలో 25 కిలోల దేశవాళీ ఆవుపేడ, 25 లీటర్ల గో మూత్రం, రెండు కిలోల పుట్టమట్టి, 5 కిలోల బెల్లం, 5 కిలోల శనగపిండి కలిపి రెండు రోజులు నానబెట్టి సవ్యదిశలో ఉదయం రెండుసార్లు, సాయంత్రం రెండుసార్లు కలిపి రెండు రోజుల తర్వాత సాగునీరు వెళ్లే బోదె ద్వారా జీవామృతం వదులుతాడు. దీనివల్ల ఒక గ్రాము పేడలో ఉండే పది లక్షల బ్యాక్టీరియా కోటికి పెరుగుతుంది. తద్వారా నాలుగు అడుగుల లోతు ఉన్నవానపాములు పైకి వచ్చి వ్యర్థాలను కంపోస్టుగా మారుస్తాయి. ఏ విధమైన రసాయనాలు వాడాల్సిన అవసరం లేదు.


కోకో కాయలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు డాక్టర్ కిరీటి, డాక్టర్ గోవర్ధన్


కొబ్బరి తోటలో అంతర పంటగా ఖోఖో, ఇతర పంటలు

చెట్లకు వచ్చే తెగుళ్ల నివారణకు పోషక లోపాలను అధిగమించేందుకు జీవన ఎరువులు వినియోగిస్తుంటారు. అజా పెరిలీయం, పాస్కో బ్యాక్టీరియా, పొటాష్ మొబలైజర్, బోరాన్, మెగ్నీషియం, టీయూడీ, సుడోమోనాస్ వంటి వాటిని వినియోగించి తెగుళ్ల, పోషక లోపాలను సమర్థవంతంగా నివారిస్తారు. పొలంలో గిరి ఆవులు, పుంగనూరు ఆవులు వంటి వాటిని పశుపోషణ కూడా సాగిస్తున్నారు. వీటికి తోడు నాటు కోళ్ల పెంపకం ద్వారా తోటలో ఎరువును తయారు చేస్తున్నాడు.


2021లో అప్పటి మంత్రి కురసాల కన్నబాబు నుంచి అవార్డు అందుకుంటున్న బుజ్జి

ఆ ఇల్లు సుందర వనం...

ఇంటి ఆవరణలో రకరకాల పండ్ల చెట్లు, పవిత్ర వృక్షాలు, ఫలాలనిచ్చే వృక్షాలు, కూరగాయలు వంటివి సాగుచేస్తున్నాడు. మారేడు, తెల్ల జిల్లేడు, కబందం, మోదుగ, మర్రి, జమ్మి, రావి, వేప, మహాబిల్వం, రుద్రాక్ష, రాఖీ, గులాబీ, సింగపూర్ విజ్జోరా, ఆర్కిడ్స్, బార్బడస్ చెర్రీ, స్టార్ ఫ్రూట్, జామ, అవకాడో, మలబారు, రామాఫలం, సీతాఫలం, లక్ష్మణఫలం, హనుమాన్ ఫలం వంటి వాటితో పాటు అల్ల నేరేడు, కాటన్‌దొర నేరేడు, థాయ్‌లాండ్ పనస, సీమచింత, రుధిరచింత, వెలగ వంటి వాటిని సాగుచేసి ఆదాయం ఆర్జిస్తున్నాడు. ఇంటి ఆవరణలో ఉన్న మామిడి చెట్లు సక్రమంగా ఫలాలను ఇవ్వకపోవడంతో వాటి కొమ్మలను కటింగ్ చేసి ఎనిమిది రకాల మామిడి అంట్లను కట్టి మామిడిపండ్లను పొందుతున్నాడు. ఒకే చెట్టుకు పెద్ద రసాలు, కొత్తపల్లి కొబ్బరి, ముంతమామిడి, పాపారాజగోవా, చిన్నరసాలు, సువర్ణరేఖ, తెలుపురసం, బంగినపల్లి వంటి వాటిని అంట్లుగా కట్టడంతో అవి ఫలాలు ఇస్తున్నాయి.



- సాగులో సత్ఫలితాలు సాధిస్తున్న బుజ్జి 2013లో జిల్లా ఉత్తమ ఖోఖో రైతు, 2021లో రాష్ట్ర ఉత్తమ కొబ్బరి రైతు అవార్డు అందుకున్నారు.
- వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్శిటీ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.
- బుజ్జి కొబ్బరితోటలో సేంద్రియ ఎరువులు, అంతర పంటల సాగును వీక్షించేందుకు యూనివర్శిటీ విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శనకు వస్తుంటారు. సాగులో అనుభవాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటారు.

గరుడ వాహనంపై నరసన్న విహారం

వైభవంగా కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు


గరుడవాహనంపై నరసింహ స్వామి గ్రామోత్సవం

కోరుకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం స్వామి వారిని కొండ పైన, దిగువున అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ఆరాధన, సర్వదర్శనం, గ్రామ బలిహరణ, సేవాకాలం నిర్వహించారు. అలాగే స్వామి వారి కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది.

గరుడ వాహనంపై గ్రామోత్సవం



నరసన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళ వారం రాత్రి 8గంటలకు స్వామి వారిని గరుడ వాహనంపై ఆశీనులను చేసి గ్రామోత్సవం చేశారు. ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశక అర్చక స్వాముల పర్యవేక్షణలో వైకానస ఆగమం, శ్రీ వైష్ణవ సాంప్రదాయం ప్రకారం గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పరాసర రఘునాథ భట్టర్‌లు గరుడ వాహనంపై ఆశీనులైన స్వామి వారికి మంగళ నీరాజనాలు పాడారు. భక్తులు పండ్లు ఫలహారాలు నివేదించారు.

నేటి కార్యక్రమాలు
- ఉదయం కొండపైన, దిగువున భక్తుల కోసం నరసింహ స్వామి సర్వదర్శనం
- రాత్రి 7గంటలకు స్వామి వారి ముఖ మండపంలో వేద పండితుల సమక్షంలో స్వామి వారికి సదస్యం
- స్వామి వారి కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన
- ధర్మ సత్రంలో ఉచిత అన్నదానం
- రంగరాజస్వామి ఆలయం వద్ద ఆధ్యాత్మిక పండిత సభలు
- రాత్రి 9గంటలకు ఆంజనేయ స్వామి వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

ముత్యాలు ఏమయ్యాయి!

- కల్యాణానికి ముందే పోశామని అంటున్న దేవస్థానం అధికారులు
- తమకు ఇవ్వలేదంటున్న భక్తులు
- రెండు రోజుల్లో భక్తులందరికీ పంపిణీ చేయాలని ఎమ్మెల్యే బత్తుల ఆదేశం

కోరుకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దాతలు స్వామి వారి కల్యాణ సమయంలో తలంబ్రాలు వాడమని సుమారు రూ.1 లక్ష విలువ చేసే ముత్యాలను దేవస్థానానికి అందజేశారు. మరో దాత, కోరుకొండ పంచాయతీ వారు, ఇతర భక్తులు స్వామి వారి కల్యాణంలో తలంబ్రాలుగా వాడమని ముత్యాలు సమర్పించారు. అయితే సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులు ఎవరికీ స్వామి వారి తలంబ్రాల బియ్యం, ముత్యాలు అందజేయకపోవడంతో అదే కల్యాణంలో ఉన్న ఎమ్మెల్యే బత్తులబలరామకృష్ణకు భక్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆలయ అర్చకులను, అన్నవరం దేవస్థానం అధికారులను ప్రశ్నించారు. అయితే కల్యాణానికి ముందే స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు పోశామని చెప్పడంతో అక్కడున్న భక్తులు, ప్రజాప్రతినిధులు అవాక్కయ్యారు. కల్యాణం జరగకుండానే తలంబ్రాలు ఎలా పోశారని ప్రశ్నించారు. భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దని నరసన్న కల్యాణంలో వాడిన తలంబ్రాలను ముత్యాలను భక్తులందరికీ రెండు రోజుల్లో పంపిణీ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఇదిలా ఉండగా 300 మందికి పైగా భక్తులు రూ.1116 చొప్పున చెల్లించి కల్యాణం టిక్కెట్లు కొనుగోలు చేశారు. వారికి కనీసం కూర్చోవడానికి స్థలం కూడా లేదని, కొందరిని కల్యాణం జరిగే హాల్‌లోకి కూడా రానీయలేదని భక్తులు ఆరోపించారు. అంతేకాకుండా టిక్కెట్లు కొనుగోలు చేసి కల్యాణం చేయించుకున్న వారికి అందజేసిన లడ్డూ ప్రసాదం ఈ సంవత్సరం నాసిరకంగా ఉందని, పరిమాణం కూడా తగ్గిందని భక్తులు చెబుతున్నారు. కల్యాణ లడ్డూలు, ముత్యాల తలంబ్రాలపై సమగ్ర విచారణ జరిపించాలని భక్తులు డిమాండ్ చేశారు.

లక్ష్మీగణపతికి మూడు వేల పెన్నులతో పూజలు


బిక్కవోలులో పెన్నులతో పూజలందుకున్న లక్ష్మీగణపతి

బిక్కవోలు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతికి మంగళవారం మూడు వేల పెన్నులతో పూజలు చేశారు. ఈ పెన్నులను హైదరాబాద్‌కు చెందిన ఆకెళ్ల సత్యసూర్యనారాయణమూర్తి పద్మావతి దంపతులు బహూకరించారని ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. పూజలనంతరం వీటిని మండలంలో పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు అందజేస్తామని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాలచర్ల వెంకటశివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, ఆలయ సిబ్బంది ప్రసాద్, రవి, ఈశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రావు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి ప్రస్తుత ఉద్యోగులకు ఐఆర్‌ను ప్రకటించాలని ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వలిశెట్టి దామోదర్‌రావు కోరారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా రెండో నిర్మాణ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు ఆదేశాలు జారీ చేయాలని, అన్ని కేడర్ ఖాళీలను రెగ్యులర్ ఉద్యోగులతో భర్తీ చేయాలన్నారు. విజయవాడ జోనల్ కార్యదర్శి వైఎస్ రావు మాట్లాడుతూ జిల్లాలోని కొందరు అధికారులు ఎంప్లాయీస్ యూనియన్ పట్ల వివక్షతతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గోకవరం డిపోలో సూపరింటెండెంట్ ట్రాఫిక్ వారు ఉద్యోగులను వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా సీహెచ్‌వీ ప్రకాష్‌బాబు, గిడ్ల చిరంజీవిలను ఎన్నుకున్నారు.

ఏప్రిల్ 7 నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

- అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలి
- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి తీర్థ కల్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 7నుంచి 13వరకు జరుగుతాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల మాదిరిగా అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం వాడపల్లి కల్యాణోత్సవాల సన్నద్ధతపై దేవదాయ, పోలీసు, రెవెన్యూ, ఇతర లైన్ డిపార్టుమెంట్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 7న ధ్వజావరోహనం, 8న స్వామివారి తీర్థం, రథోత్సవం, కల్యాణం నిర్వహిస్తారన్నారు. 9న పొన్న వాహన సేవ, 11న గోదావరినదిలో తెప్పోత్సవం, 12న మహాపూర్ణాహుతి, చక్రస్నానం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దేవదాయ ధర్మాదాయశాఖ భక్తుల సౌకర్యార్థం పోలీసుల పర్యవేక్షణలో పటిష్టమైన క్యూలైన్లను ఏర్పాటు చేయాలని, ఎక్కడా తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు, వృద్ధులకు, గర్భిణులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తూ అందరికీ వినిపించే విధంగా సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడపాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో తగినన్ని తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు రక్షిత మంచినీటిని అందించాలన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. తెప్పోత్సవానికి గోదావరి నదిలో బోట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటుచేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి చక్రధరరావు, అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, తహశీల్దార్ రాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నన్నయ వీసీకి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

ప్రదానం చేసిన తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ


తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీకి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో గ్లోబల్ ఏంజెల్స్ జేసీటీ సహకారంతో ప్రతిష్టాత్మక హెచ్ఎంటీవీ మాతృశక్తి అవార్డు-2025 కార్యక్రమంలో వీసీ ప్రసన్నశ్రీకి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ అవార్డును అందజేశారు. ఈ సదస్సులో నిర్వాహకులు వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ గురించి ప్రస్తావిస్తూ అంతరించిపోతున్న 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించిన ప్రముఖ విద్యావేత్త అని, విద్యారంగంలో చేసిన కృషికి కేంద్ర ప్రభుత్వం నారీశక్తి పురస్కారాన్ని అందించిన విషయాన్ని గుర్తుచేశారు. తెలుగు రాష్ట్రాల్లో వైస్ చాన్సలర్ బాధ్యతలు స్వీకరించిన తొలి తెలుగు గిరిజన మహిళగా గుర్తింపు పొందారని, విద్యార్థులకు వసతి గృహంలో అందిస్తున్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలని సూచిస్తూ, విద్యార్థులకు గోరుముద్దలు తినిపించి సొంత బిడ్డల్లా ఆదరిస్తున్నారంటూ ప్రసన్నశ్రీని ప్రశంసించారు. అనంతరం ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సత్కరించి, అవార్డును ప్రదానం చేశారు.

వైద్య ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీ రాణి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా వైద్యసేవల సమన్వయాధికారిణి డాక్టర్ ఎన్‌పీ పద్మశ్రీ రాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ల్యాబ్ టెక్నీషియన్ -1, ఆడియె మెట్రీషియన్-2 పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్టు తెలిపారు. అలాగే, బయో స్టాటిస్టీషియన్-1, థియేటర్ అసిస్టెంట్-1, జనరల్ డ్యూటీ అటెండెంట్-22, ఆఫీస్ సబార్డినేట్-3 పోస్టులను అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఒక ఏడాది కాలానికి భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్టు చెప్పారు. ఆయా పోస్టులకు దరఖాస్తులను ఈస్ట్‌గోదావరి.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి పొందాలని, పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 13వ తేదీ నుంచి 21వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వాసుపత్రి క్యాంపస్) జిల్లా వైద్యసేవల సమన్వయాధికారి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

భారీ స్థాయిలో జనసేన సభ

మంత్రులు నాదెండ్ల, దుర్గేష్



చిత్రాడ శివారులోని ఎస్‌బీ వెంచర్స్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు, జనసేన నాయకులు

కలెక్టరేట్(కాకినాడ)/పిఠాపురం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీన కాకినాడ జిల్లా పిఠాపురం నియోజ కవర్గంలోని చిత్రాడ గ్రామంలో నిర్వహించనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభకు భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ సభకు లక్షలాది మంది జనసైనికులు హాజరవుతారని రాష్ట్ర పౌరసరఫ రాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానికంగా విలేకరులతో సమావేశాన్ని నిర్వహించి ఆవిర్భావ సభ ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు నాదెండ్ల, కందుల మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వంలో ఉండి ఈ సభను నిర్వహిస్తున్నామని, దీనికి అధిక సంఖ్యలో హాజరవ్వడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభ ప్రాంగణంతోపాటు పలుచోట్ల వైద్య శిబిరాలు, తాగునీరు, భోజన సదుపాయం, ఎల్‌ఈడీ స్క్రీన్స్, మరుగు వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న జనసేన అధినేత పవన్ అభిమానులు, జనసైనికులు ఈ సభకు లక్షల్లో హాజరవుతారన్నారు. ఈనెల 12న వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టే యువత పోరుపై వారు స్పందించారు. యువతతోపాటు రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన జగన్ ఇప్పుడు ఫీజుపోరు అంటూ కొత్త నాటకానికి తెరలేపారన్నారు. రాష్ట్రం నాశనం అవ్వడానికి జగన్ వైఖరి కారణమన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పత్సమట్ల ధర్మరాజు, నాయకులు తలాటం సత్య, చోడిశెట్టి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సభా ఏర్పాట్ల పరిశీలన

పిఠాపురం మండలం చిత్రాడ శివారులోని ఎస్‌బీ వెంచర్స్‌లో జరిగే జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లను రాష్ట్ర పౌరసరఫరాలు, పర్యాటక శాఖామంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. సభావేదిక, ప్రాంగణంలో జరుగుతున్న పనులు, బారీకేడ్ల నిర్మాణం, గ్యాలరీల ఏర్పాట్లను పరిశీలించి పనుల నిర్వహణపై సూచనలు ఇచ్చారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాసరావు, డీకే చైతన్య, పలువురు ఎమ్మెల్యేలు,జనసేన నాయకులు ఉన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు విస్తృత బందోబస్తు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

పిఠాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో ఈనెల 14న జరిగే జనసేన ఆవిర్భావ సభ వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ బిందుమాధవ్, జనసేన నాయకులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలన జరిపారు. సభా ప్రాంగణం, హెలిపాడ్, వేదిక, గ్యాలరీలు, సభలోకి వచ్చేందుకు ఏర్పాటు చేసిన మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు గుర్తించిన ప్రాంతాలను పరిశీలించి అక్కడ జరుగుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం ఐజీ విలేకర్లతో మాట్లాడారు. ఏలూరు రేంజ్ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి పోలీసులను బందోబస్తు నిమిత్తం వినియోగిస్తామని, 1,700 నుంచి 2వేల మందితో భద్రత కల్పిస్తామని తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ బందోబస్తును పర్యవేక్షిస్తారని, అవసరమైతే అదనపు బందోబస్తు ఏర్పాటుతో పాటు అధికారులను నియమిస్తామని వివరించారు. సభకు 1.5 లక్షల నుంచి 2లక్షల మంది కార్యకర్తలు, నాయకులు వస్తారని భావిస్తున్నామని, అంతకంటే అధికంగా వచ్చినా అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు ఉండాలని సూచించినట్టు తెలిపారు. సభకు వచ్చేవారిని నేరుగా గ్యాలరీల్లోకి పంపడం, వీవీఐపీలు, వీఐపీలు, మహిళలు ఎటువంటి ఇబ్బంది లేకుండా నేరుగా వారి గ్యాలరీల్లోకి వెళ్లే విధంగా చూస్తామని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ వచ్చేందుకు ఏర్పాటు చేసిన హెలిపాడ్‌ను పరిశీలించామని, ఆయన పర్యటన వివరాలకు అనుగుణంగా బందోబస్తు ఉంటుందని తెలిపారు. కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఉన్నారు.



చిత్రాడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ, జనసేన నేతలు

ఐవీఆర్‌ఎస్ సర్వేలో రెండవస్థానానికి 'అన్నవరం'

పారదర్శకంగా సీఆర్వోలో గదుల కేటాయింపు, దర్శన సమయంతో ర్యాంక్ మెరుగు

అన్నవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రముఖ ఆలయాల్లో భక్తులకు అందుతున్న సౌకర్యాలపై చేపట్టిన ఐవీఆర్‌ఎస్ సర్వేలో కాకినాడ జిల్లాలోని అన్నవరం దేవస్థానం గత నెల కంటే ఆరు స్థానాలు మెరుగుపరుచుకుని రెండో స్థానానికి ఎగబాకింది. గత నెలలో చివరిస్థానంలో ఉన్న అన్నవరం దేవస్థానంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేయడం, దేవస్థానం ఈవో సుబ్బారావు ర్యాంకింగ్ మెరుగుపరచడం కోసం సిబ్బందికి సూచనలు చేయడం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ర్యాంకింగ్ మెరుగుపడేందుకు దోహదం చేశాయి. దీంతో పాటుగా సీఆర్వో కార్యాలయంలో భక్తులకు గదుల కేటాయింపు పారదర్శకంగా ఉండడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రోటోకాల్ మెసేజీలలో ముఖ్యమైనవి రాత్రి 9గంటల వరకు వేచి చూసి ఎవ్వరూ రాకుంటే వాటిని సైతం సాధారణ భక్తులకు కేటాయిస్తున్నారు. స్వామివారి దర్శనం, అన్నదానం క్యూలైన్లలో భక్తులు ఎక్కడా నిరీక్షణ లేకుండా త్వరితగతిన పూర్తిచేసుకుంటున్నారు. తరువాత నెల సర్వేలో మొదటిస్థానం సాధించేందుకు కృషి చేస్తానని ఈవో సుబ్బారావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. రెండవ నెల సర్వేలో సింహాచలం దేవస్థానం మొదటి స్థానం సాధించింది.

స్కూల్ బస్సు బోల్తా

నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు

ఆరుగురికి స్వల్ప గాయాలు



కాండ్రేగులలో బోల్తా పడిన స్కూల్ బస్సు



బాధితులను పరామర్శిస్తున్న జ్యోతుల నవీన్‌కుమార్

జగ్గంపేట రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాండ్రేగులలో ఓ ప్రైవేట్ స్కూల్ బోల్తాపడింది. జగ్గంపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన బస్సు మంగళవారం కాండ్రేగుల నుంచి జగ్గంపేటకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు కాగా ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 13 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్టు తెలుస్తోంది. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. స్వల్ప గాయాలైన ఆరుగురు విద్యార్థులను ప్రథమ చికిత్స అనంతరం ఇంటికి పంపించేశారు. తీవ్ర గాయాలైన నలుగురిని రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్ర గాయాలైన వారిలో తోటకూర కార్తీక్ నాగేంద్ర, తోటకూర అనిత రామచక్ర, ద్వారపూడి ధనలక్ష్మి, బొదిరెడ్డి శ్రావణిగా ఉన్నారు. విద్యార్థులంతా 6 నుంచి 9 తరగతిమధ్య చదువుతున్నారు. విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. విద్యార్థులను జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, ఎమ్మార్వో జేవీఆర్ రమేష్ పరామర్శించారు. బుదిరెడ్డి రాంబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రఘునాధరావు తెలిపారు.

2600 లీటర్ల బ్లాక్ ఆయిల్, 750 లీటర్ల డీజిల్ ఆయిల్ స్వాధీనం

గోపాలపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో ఏఎంసీ కార్యాలయంలో మంగళవారం పీడీఎస్ బియ్యం బహిరంగ వేలానికి జిల్లా పౌరసరఫ రాల శాఖాధికారి నాగాంజనేయులు తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలోని గోపాలపురం శివారులో ఉన్న పొగాకు బోర్డు ఎదురుగా అనధికారికంగా నిల్వ ఉంచిన డీజిల్, బ్లాక్ ఆయిల్, నిల్వలను సివిల్ సప్లై డీటీలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2600 బ్లాక్ ఆయిల్, 750 లీటర్ల డీజిల్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖ నిబంధనలు ఉల్లంఘించి అక్రమ వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగానే గోపాలపురం శివారులో అక్రమ ఆయిల్ వ్యాపారం జరుగుతుందన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టామన్నారు. 750 లీటర్ల డీజిల్, 2600 లీటర్ల బ్లాక్‌ఆయిల్ స్వాధీనం చేసుకుని అక్రమ వ్యాపారం చేస్తున్న వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆయిల్ సమీపంలోని పెట్రోల్‌బంకు యాజమాన్యానికి అప్పగించి పర్యవేక్షించాలని ఆదేశించారు. నిడదవోలు, దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం డీటీలు ఉన్నారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

మోతుగూడెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):ఆటో బోల్తా పడడంతో ఒక వ్యక్తి మరణించాడు. దేవీపట్నం మండలం నుంచి ఏపీ 39 యూజే 6646 ఆటోలో పది మంది చింతూరు మండలం కొండపల్లిలో జరిగే బంధువుల దిన కార్యక్రమానికి వెళ్తున్నారు. ఆటో డ్రైవర్ స్పీడ్‌గా, అజాగ్రత్తగా నడపడంతో ఆటో ఘాట్‌రోడ్డులో ఉన్న దుర్గమ్మ ఆలయం వద్దకు వచ్చే సరికి మలుపు దగ్గర బోల్తా పడింది. ఈ ఘటనలో ముచ్చిక బాబూరావుకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మిగిలినవారికి స్వల్ప గాయాలయ్యాయి. మోతుగూడెం ఎస్ఐ శివనారాయణ కేసు నమోదు చేసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మహాసేన రాజేష్‌కు మంత్రి లోకేశ్ పరామర్శ

ప్రత్తిపాడు , మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్‌ను మంగళవారం రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. మహాసేన రాజేష్ తండ్రి సాదుసుందర్‌సింగ్ మృతి చెందడంతో లోకేశ్ రాజేష్‌కు ఫోన్ చేసి పరామర్శించి సాదు సుందర్ సింగ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేసి సంతాపం తెలిపారు. ధైర్యంగా ఉండాని ఓదార్చారు.

జీజీహెచ్‌లో ముగ్గురు జీబీఎస్ బాధితులకు చికిత్స

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో గులియన్- బారే సిండ్రోమ్ (జీబీఎస్) బారిన పడిన ముగ్గురు బాధితులు చికిత్స పొందుతున్నట్టు ఆసుపత్రి సూపరిండెంట్ డా.ఎస్ లావణ్య కుమారి మంగళవారం తెలిపారు. వారిలో ఇద్దరు జీబీఎస్‌తో బాధపడుతుండగా మరో వ్యక్తిలో అనుమానాస్పద లక్షణాలు కనబడడంతో ఆ వ్యక్తిని కూడా జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డులో చేర్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జీజీహెచ్‌లో జీబీఎస్ కేసులకు సంబంధించి చికిత్స, మందులు, వ్యాక్సిన్, మౌలిక సదుపాయాలు పూర్తిగా అందుబాటులో ఉన్నాయన్నారు.

కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాడని దాడి

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఆండ్రంగిలో ప్రభుత్వ చెరువు ఆన్యాక్రాంతం అవుతోందని గ్రామంలో చదువుకున్న ఒక యువకుడు సోమవారం కాకినాడ కలెక రేట్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నెపంతో ఇంటి మీదకు వచ్చి కొందరు ఆక్రమణదారులు ఆ యువకుడిపై దాడి చేశారు. ఈ దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

కుటుంబ గొడవల నేపథ్యంలో...

పేలుడు పదార్థాలతో దాడి

మద్యంసీసాకు నారబాంబు అతికించి వెలిగించిన వైనం

సీసాపెంకులు చెల్లా చెదురు... తప్పిన ప్రమాదం



రోడ్డుపై పడి ఉన్న మద్యం సీసా,పేలిన నారబాంబు

ద్రాక్షారామ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవల నేపథ్యంలో కోనసీమ జిల్లా ద్రాక్షారామలో నున్నవారి వీధికి చెందిన మహమ్మద్ జాఫర్, అతడి కుమారుడుపై సోమవారం అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన మైనరు బాలుడు మరో ఇద్దరు వ్యక్తులు పేలుడు పదార్థాలతో దాడికి పాల్పడిన ఘటనపై ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ద్రాక్షారామకు చెందిన మహమ్మద్ జాఫర్ ద్రాక్షారామలో మటన్ వ్యాపారం చేస్తుంటాడు. నున్నవారి వీధిలో సోమవారం రాత్రి భోజనం చేసి తన కుమారుడితో కలసి రేకుల షెడ్డులో నిద్రించాడు. అర్ధరాత్రి 1.00 సమయంలో పెద్ద పేలుడు సంభవించింది. దీంతో లేచి చూడగా మైనరు బాలుడితో పాటు మరో ఇద్దరు మోటారు సైకిల్‌పై పారిపోవడం గుర్తించాడు. బయటకు వచ్చేసరికి పేలుడు దాటికి మంటలు చెలరేగి ప్రహరీగా కట్టుకున్న క్లాత్ కొంతమేర కాలిపోయింది. దుప్పట్లు కాలిపోయాయి. మద్యం సీసా పెం కులు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. రోడ్డుపై మద్యం సీసా, పేలిన నార బాంబు గుర్తించారు. దీంతో మహమ్మద్ జాఫర్ ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎం.వెంకట నారాయణ, ఎస్ఐ ఎం.లక్ష్మణ్‌తో కలసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దర్గా వద్ద మైనరు బాలుడు కుటుంబం, జాఫర్ కుటుంబానికి మ ధ్య గొడవ జరిగిన నేపథ్యంలో తనను చంపేందుకు పేలుడు పదార్థాలతో దాడి చేసినట్టు జాఫర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలం వద్ద పరిశీలిస్తే 2మద్యం సీసాల్లో పెట్రోల్ పోసి సీసాలకు నార బాంబులు అతి కించి వారికి సమీపంలో గోడపై పెట్టి కాల్చినట్టు అనుమానిస్తున్నారు. దీంతో పేలుడుకు దుప్ప ట్లు, పహరీగా కట్టుకున్న గ్రీన్ క్లాత్ కాలినట్టు చెబుతున్నారు. ఒక మద్యంసీసా పగిలిపోగా మరొకటి రోడ్డుపైన పడి ఉంది. ఒక సీసా మాత్రమే పగలడం, దుప్పట్లు కప్పుకుని నిద్రిస్తుండటంతో ప్రమాదం తప్పింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మణ్

గుర్తు తెలియని మహిళను సంరక్షించిన పోలీసులు



మహిళ

రాయవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను గుర్తించిన గ్రామస్థులు మంగళవారం రాయవరం పోలీసులకు సమాచారం అందించగా వారు సంరక్షించారు. మహిళ ఆచూకీ కోసం పోలీసులను సంప్రదించాలని రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. మహిళను వివరాల కోసం ఆరాతీయగా ఆమె నుంచి ఏ సమాధానం రాకపోవడంతో రామచంద్రపురం న్యూఫౌండేషన్ ఆశ్రమంలోచేర్పించామన్నారు.

యువతి అదృశ్యంపై కేసు



విజయలక్ష్మి (ఫైల్‌ఫొటో)

వై.రామవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం లోతట్టు ప్రాంతమైన చింతలపూడి పంచాయతీ బొడ్డగుంట గ్రామానికి చెందిన కత్తుల విజయలక్ష్మి అనే గిరిజన యువతి అదృశ్యంపై మంగళవారం వై.రామవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విజయలక్ష్మి జనవరి 4న ఇంటి నుంచి బయలుదేరి మారేడుమిల్లి సంతకు వెళ్లిందని, అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో పలుచోట్ల వెతికి ప్రయోజనం లేక ఆమె తల్లి సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేసిందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేశామని, సమాచారం తెలిస్తే 9440904361కు సమాచారం ఇవ్వాలని కోరారు.

హోంగార్డుకు పూర్వ విధులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఓ హోంగార్డుపై ఎస్ఐ దాష్టీకానికి పాల్పడడంపై 'ఆంధ్రజ్యోతి'లో 'హోంగార్డుపై ఎస్ఐ ప్రతాపం' శీర్షికన మంగళవారం వార్త వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. అతడిపై భౌతిక దాడికి దిగడంతోపాటు విధులకు కూడా భంగం కలిగించడంపై ఆత్మ పరిశీలన చేసుకున్నారు. ఈ ఘటన జరగక ముందు ఉన్న విధులకు ఆయనను పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కనీసం ప్రాథమిక ఆరా లేకుండా చిన్నస్థాయి ఉద్యోగిని చితకబాది, ప్రభుత్వాస్పత్రిలో మెడికో లీగ్ కేసు కూడా నమోదు కాకుండా అడ్డుపడిన సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఐజీ, ఎస్పీకి హోంగార్డులు విన్నవిస్తున్నారు.

తమ్మయ్యబాబుతో ఎటువంటి ఇబ్బంది కలగలేదు

ప్రత్తిపాడు సీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత


ఏలేశ్వరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జనసేన నాయకుడు వరుపుల తమ్మయ్యబాబుతో తమకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత వెల్లడించారు. ఆమె బంధువులతో కలిసి మంగళవారం తమ్మయ్యబాబు నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా లింగంపర్తిలో తమ్మయ్యబాబు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 8న ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో జరిగిన వివాదంపై వివరణ ఇచ్చారు. ఆ రోజు జనసేన నాయకుడు తమ్మయ్యబాబుతో తమకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని, రోడ్డు ప్రమాదానికి సంబంధించిన క్షతగాత్రుల సహాయకుల వల్లే తమకు ఇబ్బంది కలిగిందని ఆరోపించారు. ఆరోజు వచ్చిన వార్తలన్నీ నిరాధారాలని, కేవలం రోడ్డు ప్రమాదంలో గాయపడి వచ్చిన వారికి వెంటనే చికిత్స అందజేశామన్నారు. ఇదే సందర్భంలో వారికి దగ్గర బంధువులు కంగారు పడి తమపై కేకలు వేశారని తెలిపారు. వైద్యురాలు దగ్గర బంధువు శ్యామ్‌గోపాల్ మాట్లాడుతూ శ్వేతకు విధి నిర్వహణలో ఏ ఆటంకాలు ఎదురవ్వలేదని, తమ్మయ్యబాబు మాకు దగ్గర బంధువేనని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు శ్వేత

యానాంలో..

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

యానాం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యానాంలో కొలువై ఉన్న శ్రీభూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సుమరు 600ఏళ్ల క్రితం నాటి రెడ్డి రాజులకాలంలో నిర్మితమైన నాడు చద్దుకూడు వెంకన్నగాను...నేడు మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం వార్షిక కల్యాణ మహోత్సవాలు అప్పటి నుంచి జరుగుతున్నాయి. ఈ కల్యాణ ఉత్సవాన్ని అనువంశిక ఉత్సవదారులు చింతా వెంకటసుబ్బరావు కుటుంబసభ్యులు నిర్వహించారు. స్వామివారికి పుదుచ్చేరి ప్రభుత్వం తరుపున యానాం డిప్యూడి కలెక్టర్, పరిపాలనాధికారి మునస్వామి పట్టు పీతాంబరాలు, ప్రజల తరుపున స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్నేహ దంపతులు పట్టు వస్త్రాలు మంగళ సూత్రాలు, దేవదాయశాఖ తరపున కార్యనిర్వహణ అధికారి జ్యోతి వెంకటేశ్వర్లు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన పండితులు వాడపల్లి గోపాలచార్యులు శిష్యబృందం కల్యాణఘట్టంలోని ప్రతీ అంశాన్ని వివరిస్తూ క్రతువు నిర్వర్తించారు. ముత్తయిదువులందరికీ పసుపు, కుంకుమలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.



పట్టు వస్త్రాలు, మంగళ సూత్రాలు తీసుకెళ్తున్న అతిథులు

గృహోపకరణాల గోదాములో అగ్నిప్రమాదం

రాజమహేంద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జాతరకు కాల్చిన బాణసంచా వల్ల ఓ ప్లాస్టిక్ గృహోపకరణాల గోదాములో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఫైర్ అధికారులు, ప్రత్యక్ష సాక్షి విజయ్‌కుమార్ ప్రాథమిక సమాచారం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పాత సోమాలమ్మ ఉత్సవాల్లో భాగంగా బాణసంచా కాల్చారు. ఓ తారాజువ్వ దేవాలయం ఎదుటి సందులో ఉన్న హర్షిత ప్లాస్టిక్ ఎంటర్‌ప్రైజెస్ గోదాము ప్రాంగణంలోని ఓ ఎండిపోయిన కొబ్బరిచెట్టుపై పడింది. అది రాజుకుని నిప్పులు కింద కొబ్బరి మట్టల్లో పడి మంటలు చెలరేగి పక్కనే ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములకు మంటలంటుకున్నాయి. గోదాము ప్లాస్టిక్ గృహోపకరణాలు కావడంతో వేగంగా మంటలు చెలరేగాయి. ప్లాస్టిక్ డ్రమ్ములకు మూతలు ఉండడంతో పెద్ద శబ్దంతో పేలడంతో చుటుపక్కల ఇళ్లలోని నివాసితులు బయటికి పరుగులు పెట్టారు. కొవ్వూరు, ఇన్నీసుపేట, ఆర్యాపురం ఫైర్ ఇంజన్లతో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఆస్తి నష్టం రూ.20 లక్షల వరకూ ఉంటుందని యజమాని చెబుతున్నారని చీఫ్‌ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్‌కింగ్ పేర్కొన్నారు.



ఎగిసిపడుతున్న మంటలు

మృతదేహంతో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా

కాకినాడ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఇంద్రపాలెంలోని సౌత్ ఎక్సైజ్ స్టేషన్‌వద్ద ఏటిమొగలో జరిగిన సంఘటనలో కర్రి సత్యవతి (70) మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. అక్రమంగా మద్యం అమ్ముతున్నారనే సమాచారంతో ఎక్సైజ్ ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుల్స్ మంగళవారం రాత్రి 7.30 గంటలప్రాంతంలో ఏటిమొగ తూర్పు పక్క ఆంజనేయస్వామి గుడికి సమీపంలో తనిఖీచేయగా కర్రి పద్మావతి ఆందోళనకు గురై కిందపడిపోయింది. ఆమెను కుటుంబసభ్యులు జీజీహెచ్‌కు తీసుకువెళ్లగా అక్కడ మరణించినట్టు సమాచారం. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు కలిసి మృతదేహాన్ని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్కడ తమకు న్యాయం చేయాలంటూ ధర్నా చేశారు. కొంతసమయం తరువాత విరమించి మృతదేహాన్ని తీసుకుని వెళ్లిపోయారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఈ సమస్యపై మాట్లాడుతూ తమ పోలీసుల వల్ల ఆమె చనిపోయిందేమోననే అనుమానంతో వారంతా మృతదేహంతో స్టేషన్‌వద్దకు వచ్చారని, జరిగిన సంఘటనను వారందరికీ వివరించడంతో వెళ్లిపోయారన్నారు. ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చినవారిలో అసిస్టెంట్ కమిషనర్ రేణుక, ఏఈఎస్ మౌనిక, సూపరింటెండెంట్ కృష్ణకుమారి, సీఐ నిరంజన్‌రావు ఉన్నారు.

అభ్యంతరాలు తెలపండి

ముమ్మిడివరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో కంజెస్టడ్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్లానింగ్ అప్రూవల్ అనుమతి ఇచ్చేందుకు ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలుస్వీకరిస్తున్నట్లు కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. ఈమెయిల్ లేదా కార్యాలయంలో 7రోజుల్లో ఫిర్యాదు చేయాలన్నారు.

అంగన్‌వాడీలను చర్చలకు పిలవాలి

ఉప్పలగుప్తం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలను వెంటనే చర్చలకు పిలిచి వారి న్యాయమైన కోర్కెలను తీర్చాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గెడ్డం సురేష్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం గొల్లవిల్లిలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలకు నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలన్నారు.

వైసీపీ పోరుబాట హాస్యాస్పదం

టీడీపీ ఎస్సీసెల్ జిల్లా శాఖ అధ్యక్షుడు నారాయణరావు



మాట్లాడుతున్న నారాయణరావు

అమలాపురం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు సక్రమంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన చెల్లించని జగన్ ఆధ్వర్యంలో నేడు వైసీపీ చేపట్టిన యువత పోరుబాట కార్యక్రమం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ ఎస్సీసెల్ జిల్లాశాఖ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు (బాలు) విమర్శించారు. తాను పెండింగ్‌లో పెట్టిన ఫీజు బకాయిలపై ఉద్యమించాలంటూ తన పార్టీ కార్యకర్తలకు జగన్ పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అమలాపురం ఎర్రవంతెన వద్దగల ఎంపీ హరీష్‌మాధుర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం టీడీపీ ఎస్సీసెల్ జిల్లాశాఖ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఫీజు బకాయిలపై ఉద్యమంచేసే నైతిక హక్కు జగన్‌కు లేదన్నారు. వైసీపీ హయాంలో ఉన్నత విద్యార్థులకు 4,271కోట్లు, వసతిదీవెనకు రూ.989కోట్లు, పీజీ విద్యార్థులకు రూ.450కోట్లు బకాయిలు పెట్టిన మాట వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్లో భాగంగా రూ.788 కోట్లు విడుదలచేసి విద్యార్థులను ఆదుకున్నారని గుర్తుచేశారు. ఇప్పటికైనా జగన్ బూటకపు ఉద్యమాలకు స్వస్తిచెప్పి అసెంబ్లీలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బాలు సూచించారు. సమావేశంలో ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి చుట్టుగుళ్ల కిశోర్, హెచ్ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు, లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కరజోగేష్, టీడీపీ గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మిడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి జల్లి బాలరాజు, ఎస్సీసెల్ అధికార ప్రతినిధి పైడి బుజ్జి, నేలపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

డీఈవో షేక్ సలీంబాషా



మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీంబాషా

ముమ్మిడివరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థిలో ఏదో ఒక అంశంలో ప్రావీణ్యత ను కలిగి ఉంటారని, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే విధంగా బోధన ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా పిలుపునిచ్చారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలో మంగళవారం పార్టుటైమ్ ఇనస్ట్రక్టర్లకు ఏఎంవో పి.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సలీంబాషా ముఖ్య అతిథిగా మాట్లాడారు. పీఐటీలందరూ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేయాలన్నారు. సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న డ్రాయింగ్, క్రాఫ్ట్స్, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు కృషిచేయాలన్నారు. ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 117సీఆర్ఎంపీలు, 51మంది ఐటీ సిబ్బంది, 270మంది పీటీఐలకు వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంచేందుకు సోమ, మంగళవారం విద్యా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించామన్నారు. ఫైనాన్స్ అక్కౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణలు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, సమగ్రశిక్ష ఎఫ్ఏవో జి.ప్రవీణ్‌కుమార్, సమగ్రశిక్ష ఏఎంవో పి.రాంబాబు, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, డీఎస్వో జీవీఎస్ సుబ్రహ్మణ్యంలను పీటీఐ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జిల్లాలో ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పీటీఐలు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి కల్యాణం



సత్యనారాయణస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మాకనపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఅనంతలక్ష్మి భూదేవి సమేత సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం తెల్లవారుజామున రమణీయంగా నిర్వహించారు. మద్దాల మాధవరాయుడు-రత్నకుమారి దంపతులు కర్తలుగా పాల్గొని ఈకల్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్చారణలు, భక్తుల కోలాహలం మంగళవాయిద్యాల నడుమ అర్చకులు సుదర్శనం శేషాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును ఘనంగా చేశారు. ముత్యాల తలంబ్రాలను గ్రామానికి చెందిన మద్దాల దొరబాబు కానుకగా సమర్పించారు. రాత్రి గరుడ వాహనంపై ఉభయ దేవేరులతో స్వామివారిని ఊరేగించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం అధిక సంఖ్యలో భక్తులు, భక్త దంపతులు స్వామివారి వ్రతమాచరించి అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఓఎన్జీసీ తీరుకు మోకాళ్లపై అర్ధనగ్న ప్రదర్శన



అల్లవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామ దత్తత అభివృద్ధి పట్ల ఓఎన్జీసీ అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా గ్రామస్తులు చేపట్టిన ఆందోళన రోజుకోరీతిలో ఉధృతంగా సాగుతుంది. ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద మంగళవారం చొక్కాలు తీసి మోకాళ్లపై కూర్చొని అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. సముద్ర కోత నుంచి ఓడలరేవు గ్రామాన్ని రక్షించాలని, ఓడలరేవును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న డిమాండ్‌తో తొమ్మిదో రోజు ఆందోళన చేపట్టారు. ఓఎన్జీసీ అధికారులు స్పందించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, పోలమూరి వెంకటరెడ్డి, పెచ్చెట్టి సత్యనారాయణ, నాగాబత్తుల గోపి, తాడి ధర్మారావు, పినపోతు ప్రకాష్, ఇల్లింగి శ్రీనివాసరావు తదితరులు ఓఎన్జీసీ అధికారుల వైఖరికి నిరసనగా మోకాళ్లపై నిలుచుని అర్ధనగ్న నిరసన తెలిపారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, గుర్రం కృష్ణ, మంతెన సురేష్‌రాజు తదితరులు ఓడలరేవు గ్రామస్తుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

'సామాజికవర్గాల మధ్య చిచ్చు పెడుతున్న తహశీల్దార్'



అమలాపురం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెడుతున్న తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేస్తూ కలెక్టరేట్ ఎదుట నడిపూడి వాసులు మంగళవారం ధర్నా చేపట్టారు. నడిపూడిలో రెండు సామాజికవర్గాల మధ్య ఉన్న భూవివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాల్సింది పోయి ఘర్షణ తలెత్తే విధంగా తహశీల్దార్ వ్యవహరించారని ఆరోపించారు. తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. నిరసనలో డీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, బుడితి దయామహేష్, కుంచే రమేష్, గోసంగి శ్రీనివాసరావు, గుమ్మళ్ల శ్రీను, జంగాసుమతి, నాగాబత్తుల భారతి తదితరులు పాల్గొన్నారు. ఈఅంశంపై తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్‌ను వివరణ కోరగా గ్రామకంఠం భూములను ప్రభుత్వం సర్వే చేయిస్తుందని, నడిపూడిలోని భూమిని సైతం సర్వేయర్ ద్వారా సర్వే చేయించి సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

ఆసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ

అమలాపురం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి గోదావరి జిల్లా పరిధిలో ఆసుపత్రిలోని పలు పోస్టులను అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్టు జిల్లా వైద్యసేవల సమన్వయ అధికారిణి డాక్టర్ ఎస్సీ పద్మశ్రీ ఒకప్రటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు 1, ఆడియో మెట్రీషియన్ 2 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వయో స్టాటస్టిషన్ 1, థియేటర్ అసిస్టెంట్ 1, జనరల్ డ్యూటీ అటెండెంట్ 22, ఆఫీస్ సబార్డినేట్ 3 పోస్టులను అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదిన ఏడాది కాలానికి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తులను పూర్తిచేసి ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కొవ్వూరులోని జిల్లా వైద్యసేవల సమన్వయ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

జాబ్‌మేళాలో 27మంది ఎంపిక

ముమ్మిడివరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 52మంది హాజరు కాగా 27మంది ఎంపికయ్యారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శ్రీదేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు తదితరులు హాజరయ్యారు.

ఈ-క్రాప్ సోషల్ ఆడిట్

అంతర్వేది, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వీవీమెరక గ్రామంలో ఈ-క్రాప్ సోషల్ ఆడిట్ గ్రామసభను వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రధానంగా రైతులు ప్రభుత్వ పథకాలను సకాలంలో వినియోగించుకోవాలని, అలాగే ఈ-క్రాప్ సోషల్ ఆడిట్ విధానానికి ప్రతీ రైతు నమోదు ప్రక్రియలో భాగస్వాములవ్వాలన్నారు. అనంతరం రైతులకు ఈ-క్రాప్ విధానంపై అవగాహన కల్పించి, పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

14న హలో అమలాపురం.. చలో పిఠాపురం



జనసేన నాయకులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్

అమలాపురం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జనసేన 12వ ఆవిర్భావ సభను పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడలో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్ తెలిపారు. అమలాపురంలో మంగళవారం నల్లాశ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేసేందుకు హలో అమలాపురం.. చలో పిఠాపురం పేరుతో పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారన్నారు. అమలాపురం నియోజకవర్గం నుంచి అత్యధికంగా పార్టీ శ్రేణులు తరలివెళ్లేలా స్థానిక నాయకులు సమన్వయంతో ప్రత్యేకంగా బస్సులు, కారులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో నాయకులు కల్వకొలను తాతాజీ, కంచిపల్లి అబ్బులు, యేడిద శ్రీను, లింగోలు పండు, కొప్పుల నాగమానస, ఇసుకపట్ల రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

అల్లవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడో ఈనెల14న జరిగే జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో జనసేన అధ్యక్షుడు రోళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జనసేన సమావేశం జరిగింది. జనసేన ఆవిర్భావ సభ కరపత్రాలను పంపిణీ చేశారు. మేకల ఈశ్వరరావు, పొట్టుపోతు దుర్గారావు, రొక్కాల నాగేశ్వరరావు, అడపా సాయిబాబు, పినిశెట్టి రామకృష్ణ, గంధ్రోతు రాజు, ఈతకోట వెంకటరమణ, ముత్యాల అజయ్, రామారావుపాల్గొన్నారు.

చిత్రాడ సభకు జనసైనికులకు ఆహ్వానం

ఉప్పలగుప్తం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చిత్రాడలో ఈనెల14నజరిగే జనసేన 12వ ఆవిర్భావ సభను విజయవంతం చెయ్యాలని పార్టీ అబ్జర్వర్, నెల్లూరు సిటీ జనసేన ఇన్‌చార్జి దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో జనసేన నాయకులతో కలిసి జనసైనికులు ఆహ్వానించారు. కార్యక్రమంలో నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, ఆకుల సూర్యనారాయణమూర్తి, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఆకుల బుజ్జి, చిక్కం సుధాసూర్య మోహన్, వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ, గుత్తాల సుభాష్‌చంద్రరావు, దంగేటి బాబులు, అయితాబత్తుల వెంకటకృష్ణారావు, సుంకర అబ్బాయి, మంచెం బాలకృష్ణ, సలాది నాగరాజు, సత్తి చిన్నా, మేకల నానాజీ, పైబోడి పండు, సుందరనీడి ఏసు తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

అంబాజీపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చిత్రాడలో ఈనెల14న నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భావ సభకు అధిక సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో జనసేన పార్టీ మండల సమావేశం నిర్వహించారు. పి.గన్నవరం నియోజకవర్గ నుంచి బస్సులు బయలుదేరతాయని, అక్కడికి చేరుకుని జనసైనుకులంతా భారీగా తరలివెళ్దామని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మలేరియా జిల్లా అధికారిగా వెంకటేశ్వరరావు



కలెక్టర్‌ను కలిసిన దృశ్యం

అమలాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా మలేరియా అధికారిగా నక్కా వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొరకు జాయినింగ్ రిపోర్టును అందించారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి ఏజెన్సీ జిల్లా మలేరియా కార్యాలయంలో, రాజమహేంద్రవరంలో సీనియర్ ఎంటమాలజిస్ట్‌గా పనిచేసి పదోన్నతిపై జిల్లా మలేరియా అధికారిగా వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు.

కూటమి ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేయవద్దు

జిల్లా తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా అధ్యక్షురాలు మోకా పార్వతి



రాజోలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమ స్వార్థ ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేయవద్దని తెలుగునాడు జిల్లా అంగన్‌వాడీ, డ్వాక్రా అధ్యక్షురాలు మోకా పార్వతి సీఐటీయూ యూనియన్‌కు విజ్ఞప్తి చేశారు. రాజోలులో మంగళవారం ఆమె స్వగృహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీలకు మేలు చేసిందని తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్, కూటమి ప్రభుత్వమేనన్నారు. విజయవాడలో కూటమి ప్రభుత్వానికి అంగన్‌వాడీలు వ్యతిరేకంగా ధర్నా చేయడం సబబు కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18,800 అంగన్‌వాడీ భవనాలు కట్టించి అనేక సౌకర్యాలు కల్పించి, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం నుంచి వచ్చే మరిన్ని పథకాలు అంగన్‌వాడీలకు వర్తించేలా తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ కృషి చేస్తుందన్నారు.

యువ పోరుబాట హాస్యాస్పదం

మామిడికుదురు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ యువ పోరుబాట అని కలెక్టరేట్‌ను ముట్టడించడం హాస్యాస్పదమని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ఎద్దేవా చేశారు. మగటపల్లిలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు జరుగుతున్న అసెంబ్లీ కార్యక్రమాలకు హాజరు కాకుండా జగన్మోహన్‌రెడ్డి యువ పోరుబాట పేరుతో కలెక్టరేట్‌ను ముట్టడించడం హేయమైనచర్య అని ఆరోపించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అపరాలు సాగుచేయాలి

అంబాజీపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): దాళ్వా అనంతరం మూడో పంటగా రైతులు అపరాల సాగు చేపట్టాలని ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు సూచించారు. ఇరుసుమండలో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రాయితీపై అందిస్తున్న పథకాలనుసద్వినియోగించుకోవాలన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



అమలాపురం రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సమనస గ్రామ పంచాయతీ పరిధిలోని బాబూనగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు మాతా రమాబాయి అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ పుణ్యమంతుల రజనీ ఆధ్వర్యంలో సాయం పంపిణీ చేశారు. చల్లపల్లి, సింగరాయపాలెం, అనాతవరం గ్రామాలకు చెందిన సభ్యులు సమకూర్చిన నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాలను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో గుర్రాల సుజాత, జంగా తనూజ, అయితాబత్తుల భీమాబాయి, అయితాబత్తుల మంగ, కందేరి మణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అగ్ని బాధితులకు సాయం పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులతో పాటు సర్పంచ్ పరమట శ్యామ్‌కుమార్, మాజీ సర్పంచ్ నడింపల్లి ఉదయబాబు పాల్గొన్నారు.

కొత్త గృహాలకు అదనపు సాయం:ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ సంస్థ ద్వారా కొత్తగా ఇళ్ళు నిర్మించుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సాయం అందిస్తున్నట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, గిరిజనులకు రూ.లక్ష వంతున అందిస్తారని అన్నారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ళకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. దీనికి తోడు డ్వాక్రా సభ్యులకు సున్నా వడ్డీపై రూ.35వేలు రుణం అందిస్తారన్నారు.

దళిత చైతన్యవేదిక సేవలు అభినందనీయం

రాజోలు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సమాజానికి దళిత చైతన్యవేదిక చేస్తున్న సేవలు అభినందనీయమని వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు అన్నారు. కడలి ప్రభుత్వ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యను అభ్యసిస్తున్న 53మంది విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు తదితర విద్యా సామాగ్రిని సర్పంచ్ చొప్పల గుణనాథ్ మంగళవారం అందజేశారు. హెచ్ఎం ఎస్ఎస్ఎస్ శర్మ, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, చిలకపాటి శ్రీధర్, మట్టా సురేష్‌కుమార్, విప్పర్తి మహేష్, విద్యాకమిటీ చైర్మన్ వడ్లమూడి ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి రథోత్సవం

మలికిపురం, మార్చి11(ఆంధ్రజ్యోతి): మోరికనకమహాలక్ష్మమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవాల సందర్భంగా మంగళవారం అమ్మవారి రథోత్సవం వైభవోపేతంగా జరిగింది. రథోత్సవానికి పరిసర గ్రామాల నుంచి భక్తులు పోటెత్తారు. ముందుగా అమ్మవార్లకు కుంభం చెల్లించారు. మహిళా భక్తులు వందలాది మంది మొక్కుబడిగా అమ్మవార్లకు బూర్లను నైవేద్యంగా సమర్పించారు. వేలాదిగా భక్తులు తరలిరాగా ముందుగా మహిళా భక్తులు రథాన్ని లాగారు. భారీస్థాయిలో బాణసంచా కాల్చారు. వివిధసాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు.ఆనవాయితీగా రథాన్ని ముప్పర్తివారి కుటుంబ సభ్యులు ముందుకు నడిపించారు. మోరి, మోరిపోడు, వియ్యారివారిమెరక గ్రామాల్లో రథోత్సవం జరిగింది.

మామిడికుదురు హైస్కూలు వెబ్‌సైట్ ప్రారంభం

మామిడికుదురు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గోకవరపు గణాధిపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూలు వెబ్‌సైట్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా ప్రారంభించారు. ఈవెబ్‌సైట్‌ను పూర్వ విద్యార్థి ఐబీఎం ఉద్యోగి అయిన పి.నవీన్‌కుమార్ అభివృద్ధి చేశారు. స్కూలు వెబ్‌సైట్‌ను ప్రారంభించిన విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ఈవెబ్‌సైట్ అన్నివిధాలా విద్యార్థులకు ఉపయోగపడుతుందని, వెబ్‌సైట్‌ను అభివృద్ధిచేసిన నవీన్‌ను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ నిరంజని, ఉపాధ్యాయులు సీహెచ్ రమేష్‌బాబు, సీహెచ్ మనోహర్‌రాజు పాల్గొన్నారు.

సీసీఎల్ క్రికెట్ టోర్నీ విజేతగా డీడీఎలెవెన్

అమలాపురం టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీచెన్నమల్లేశ్వరా కళాపరిషత్ గ్రౌండ్స్‌లో ఐదు రోజులుగా సీసీఎల్ క్రికెట్ టోర్నీని జిల్లాస్థాయిలో నిర్వహించారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో ఈపోటీలను నిర్వహించగా సీసీఎల్ సీజన్-2 ఫైనల్‌కు డీడీఎలెవెన్, ఎంఎం జట్లు చేరుకున్నాయి. జిల్లాలోని 38జట్లు ఈపోటీల్లో పాల్గొనగా ఫైనల్స్‌లో డీడీఎలెవెన్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా ఎంఎం జట్టు నిలిచింది. విన్నర్ జట్టుకు రూ.30వేలు నగదుతో పాటు ట్రోఫీని నాయకులు నల్లా పవన్‌కుమార్, దున్నాల దుర్గలు అందజేశారు. రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.20వేలు నగదుతో పాటు ట్రోఫీని ఉద్దీశ చిన్నా, గునిశెట్టి బాబు, పిండి రాజా, పోలిశెట్టి కిరణ్‌లు అందించారు. ఐదు రోజులు నిర్వహించిన క్రికెట్ టోర్నీని నిర్వాహకులు పేరాబత్తుల ఫణి, ఉద్దీశ కిశోర్, నల్లా సాయి, ఉద్దీశ చిన్నా, నల్లా చిట్టిబాబు, నల్లా మల్లిబాబు, ముచ్చర్ల రమేష్‌లు పర్యవేక్షించారు.

మహిళల సాధికారతకు కూటమి ప్రభుత్వం కృషి

అయినవిల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మహిళల కలలను సాకారం చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అయినవిల్లి మండల తెలుగు మహిళలు పేర్కొన్నారు. మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో మహిళలు కూటమి ప్రభుత్వం పనితీరుపై వారు హర్షం వ్యక్తంచేశారు. దీపం పథకం ద్వారా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారని, వచ్చే నెలలో తల్లికి వందనం, ఉచిత బస్ ప్రయాణం తదితర పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చిట్టూరి శ్రీను, మద్దల సుబ్రహ్మణ్యం, సలాదినాయుడు, బిక్కిన బాబి, కుడుపూడి బుజ్జి, కోడూరి రఘు, వస్కా శ్యామ్, కుమ్మరి మాధవివెంకటరమణ మధుర రమేష్, గెడ్డం రమేష్, పులిదిండి సురేంద్ర, ఇసుకపట్ల బాబి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన సప్తాహం

మామిడికుదురు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక గ్రామంలోని బొక్కావారిపాలెంలో వేంచేసి ఉన్న రామాలయం వద్ద నిర్వహిస్తున్న సప్తాహ మహోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా ముగిసింది. కంచి నీలకంఠగురుమూర్తి, నాగలక్ష్మి దంపతులతో నిర్వహించిన పూర్ణాహుతితో ఈసప్తాహం ముగిసింది. ఈనెల4వతేదీ నుంచి ప్రారంభమైన ఈసప్తాహ కార్యక్రమంలో శ్రీరామనామ సర్వనామ కీర్తనలతో నిరంతరాయంగా ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ సేవలు అందించిన భజన కళాకారులను ఉత్సవ కమిటీ సభ్యులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఏడు రోజులు ఉదయం, రాత్రి స్వామివారికి సుప్రభాతసేవ, పవళింపు సేవ, ఇతర పూజా కార్యక్రమాలను బ్రహ్మశ్రీ గాడేపల్లి సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మంగళవారం ఆలయం వద్ద జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

మామిడికుదురు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. మంగళవారం నగరం ఏఎంసీ ప్రాంగణంలో మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా అధ్యక్షతన నిర్వహించిన ఆవిర్భావ సభ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈనెల14వ తేదీ పిఠాపురం చిత్రాడలో జరిగే జనసేన 12వ ఆవిర్భావ సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. జనసేన అబ్జర్వర్లు, పిసిమి చంద్రశేఖర్, కరాటం సాయి, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, గుబ్బల దుర్గ, పి.గన్నవరం సీటిసంఘ చైర్మన్ మద్దాల బాబ్జి, నాయకులు, వాసంశెట్టి కుమార్, కొమ్ముల కొండలరావు, విళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం

ఉప్పలగుప్తం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్.యానాం వైపు ప్రవహించే కొత్తకాల్వలో 45-50ఏళ్ళ పురుషుని గుర్తుతెలియని మృతదేహాన్ని మంగళవారం స్థానికులు కనుగొన్నారు. స్థానిక వీఆర్వో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చలమల రాజేష్ తెలిపారు.

పాఠశాలకు విరాళం

మలికిపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బట్టేలంక జిల్లాపరిషత్ హైస్కూలుకు కూనపరాజు వెంకటరామచంద్రరాజు ప్రోత్సహంతో దంతులూరి రామకృష్ణంరాజు జ్ఞాపకార్థం రూ.27వేలతో పాఠశాల ఆవరణలో వ్యాయామశాల ఏర్పాటు చేశారు. మంగళవారం స్కౌట్ బాలురకు ఏకరూపు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హనుమంతరావు, సర్పంచ్ బోనం సీతారత్నం, ఎస్ఎంసీ చైర్మన్ ఎల్.దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు ఆవుపాటి శివజ్యోతి, ముదునూరి సీతారామరాజు, రామచంద్రరాజు, నాగరాజు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే మహిళలకు న్యాయం

మలికిపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మలికిపురంలో జరిగిన మహిళల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆనాడు ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమానహక్కు, రిజర్వేషన్లు కల్పించి మహిళలను అన్నిరంగాల్లో ముందుకు తీసుకువచ్చారన్నారు. అదేవిధంగా చంద్రబాబునాయుడు మహిళల కోసం ఎన్నో కార్యక్రమాలు అమలుచేశారన్నారు. సర్పంచ్‌లు కోట పుష్పకుమారి, చెల్లుబోయిన హెలీన, కాండ్రేగుల భవానీ, కాకి లక్ష్మీదేవి, కడలి దుర్గాదేవి, అడబాల రమాదేవి, జాంబవతి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం

ముమ్మిడివరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గాడిలంకలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మశ్రీ బాదంపూడి ప్రసాదశర్మ బ్రహ్మత్వంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యజమానులు పిండి లక్ష్మణమూర్తి-సరోజ, కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు సత్యవతి, తాడి తరుణ్‌సుబ్రహ్మణ్యం-సాయిదుర్గ దంపతులతో పూజా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలంతా స్వామివారికి పాలాభిషేకం నిర్వహించారు. బ్యాండు మేళాలు, భాజాభజంత్రీలతో స్వామివారి విగ్రహాన్ని గ్రామపురవీధుల్లోఊరేగించారు.

మట్టి అక్రమ తరలింపు మళ్లీ ప్రారంభం

కాట్రేనికోన, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మట్టి అక్రమ తరలింపు మంగళవారం మళ్లీ మొదలయ్యింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మట్టి తరలింపు ట్రాక్టర్లు ఆర్అండ్‌బీ రోడ్డుపై దూసుకుపోతున్నాయి. రవాణాశాఖ అధికారులు ఏ క్షణంలోనైనా వస్తారేమోనన్న అనుమానంతో సోమవారం విరామం ఇచ్చారు. ఆ శాఖలో కూడా కొంతమందిని గుప్పెట్లో పెట్టుకున్నారు. మట్టి ట్రాక్టర్ల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగితే సంబంధిత శాఖ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మట్టిని తరలిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదని, అలాకాకుండా ట్రాక్టర్లలో డీజే బాక్సులు పెట్టుకుని మైనర్లు వాహనాలు నడుపుతున్నారని ప్రజలు భయపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేసేందుకు సిద్ధంగాఉన్నారు.

పొలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి.. చంపుతామని బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు

అమలాపురం రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి పొలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించడంతో పాటు దింపులు తీసి కొబ్బరికాయలు తరలించడంతో పాటు అడ్డువచ్చిన వారిని చంపుతామని బెదిరించిన కేసులో పలువురిపై కేసు నమోదుచేసినట్టు అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు మంగళవారం తెలిపారు. బండారులంకలో తన ఆధీనంలో ఉన్న కొబ్బరి తోటలోకి గ్రామానికి చెందిన డీవీవీ సత్యనారాయణ, డి.రుద్రప్రసాద్, జక్కంశెట్టి శ్రీనివాసరావు, దంగేటి నారాయణరావు తదితరుల ప్రోద్బలంతో గుబ్బల జానకీ, వారి కుటుంబ సభ్యులు మారణాయుధాలతో ప్రవేశించి దింపు తీశారు. అడ్డువచ్చిన తనతో పాటు తన కుటుంబ సభ్యులను చంపుతామని బెదిరించినట్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు దౌర్జన్యానికి పాల్పడ్డవారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

'అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి'

అమలాపురం రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న బీఎస్ నారాయణపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అమలాపురం ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు మంగళవారం నాటికి 16వ రోజుకుచేరుకున్నాయి. దీక్షాశిబిరాన్ని సందర్శించిన శ్రీనివాసరావు ఆర్టీసీ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుబట్టారు. అనంతరం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చలో డీపీటీవో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయం ఎదుట పెద్దఎత్తున నినాదాలు చేశారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని నినాదాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరాజు, జోనల్ కార్యదర్శి అడపా రామారావు, జోనల్ అధ్యక్షుడు డీఎంఆర్ రాజుతో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అమలాపురం రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి తెలిపారు. బుధవారం ఉదయం 11నుంచి 12గంటల వరకు ఈకార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు సెల్ 9581932678కు తెలియచేయాలని మూర్తి కోరారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.02 లక్షలు

ఆత్రేయపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,02,913 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

గోగులమ్మ అమ్మవారికి చీర, సారె సమర్పణ


అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకు వెళుతున్న దృశ్యం

ద్రాక్షారామ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వెలంపాలెంలోనున్న గోగులమ్మ అమ్మవారికి మంగళవారం పట్టువస్త్రాలు, చీర సమర్పించారు. భీమేశ్వరుని ఆడపడుచుగా గోగులమ్మ అమ్మవారికి జాతర సందర్భంగా పట్టువస్త్రాలు, సారె సమర్పిస్తున్నారు. గోగులమ్మ జాతరను పురస్కరించుకుని మంగళవారం భీమేశ్వరస్వామి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పండ్ల తో ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వెలంపాలెం సర్పంచ్ టేకుమూడి సుజాత తదితరులు మంగళ వాయిద్యాలతో శోభాయాత్రగా గోగులమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లారు. అనంతరం అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, పండ్లు, పుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు


వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కపిలేశ్వరపురం, మార్చి11(ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈనెల 9న ప్రారంభమైన స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆలయ అర్చకుడు ఎస్ఎల్ఎన్‌బీ శ్రీనివాసాచార్యులు తదితరులు విశేషార్చనలు, నిత్య హోమాలు, బలిహరణ తదితర పూజలను జరిపారు. సోమవారం రాత్రి కపిలేశ్వరపురానికి చెందిన పెద్దింటి వెంకటలక్ష్మీనరసింహాచార్యులు, ప్రసన్నకుమార్ భార్గవాచార్యులు ఆధ్వర్యంలో అర్చ కులు సంపర లక్ష్మీ నరసింహ భాస్కర శ్రీనివాసాచార్యులు, పలువురు అర్చకులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తు లతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ ఈవో రాంబాబురెడ్డి, పుత్సల శ్రీనివాస్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


రావులపాలెంలో వెంకటేశ్వరస్వామికి హనుమత్ వాహనసేవ నిర్వహిస్తున్న దృశ్యం

రావులపాలెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామివారికి ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు ఆధ్వర్యంలో వాడపల్లి కమలనాథ్ అర్చకత్వంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపారు. ఉదయం హనుమత్ వాహన సేవ, రాత్రి డోలోత్సవం, గజవాహనోత్సవం ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు, గోవిందమాలధారులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వీటి ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి పర్యవేక్షించారు.


అముజూరు సాయిబాబా ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

కె.గంగవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అముజూరు సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా పలువురు ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబాకు పాలాభిషేకాలు, భజనలు చేశారు. అనంతరం అన్న సమారాధన చేశారు. అముజూరు, పామర్రు, యండగండి, కూళ్ల, కురకాళ్లపల్లి, పాణింగపల్లి తదితర గ్రామాల ప్రజలు సాయిబాబాకు పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

'ఎమ్మెల్సీ ఎన్నికలపై హైకోర్టును ఆశ్రయిస్తాం'


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి

రావులపాలెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేయనున్నట్లు ఎమ్మెల్సీ పోటీ అభ్యర్థి మెర్ల శాస్త్రులు అన్నారు. రావులపాలెంలో మంగళవారం పోటీ చేసిన ఎమ్మెల్సీ అభ్యర్థుల దరఖాస్తుదారులతో సమావేశం జరిపారు. సమావేశంలో పాల్గొన్న వారు ముందుగా ఎన్నికల సమయంలో వారి ఇబ్బందులను చర్చించారు. అనంతరం శాస్త్రులు మాట్లాడుతూ ఓటర్ నమోదు నుంచి ఓటింగ్ వరకు అధికార పార్టీ అభ్యర్థికి అనుకూలంగా, ఇతర అభ్యర్థులకు వ్యతిరేకంగా విధానాలు ఉన్నాయన్నారు. అభ్యర్థులందరూ చేసిన సమాలోచనతో ప్రజాప్రయోజన వాజ్యం సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్‌లో జగ్గంపేటలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో పోటీ అభ్యర్థులు నూరు హుస్సేన్, జేవీ రామారావు, పినిపే నాగభూషణవర్మ, బొమ్మిడి సన్నిరాజు, బీవీ శ్రీరామచంద్రమూర్తి, గౌతమ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు నిర్మించాలంటూ వినతిపత్రం

రాయవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పసలపూడి గ్రామంలో రోడ్లు నిర్మించాలంటూ గ్రామస్తులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి ఎ.గోవిందరాజులకు వినపతిపత్రం ఇచ్చారు. గ్రామంలో బండిరేవు గట్టు-కృష్ణమ్మ చెరువు రోడ్డు నిర్మించి 30 ఏళ్లు అవుతోందన్నారు. పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలపారు. ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో నాగమ్మగారి వీధి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చినట్లు బీజేపీ నాయకుడు చింతా తమ్మిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు నల్లమిల్లి అప్పారెడ్డి, పెంకే వెంకటేష్, కర్రి వెంకటరెడ్డి, మండ రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వైభవంగా కేశవస్వామి కల్యాణం

మండపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం జెడ్.మేడపాడు గ్రామంలోనున్న కేశవస్వామివారి ఆలయంలో అర్చకుడు వినయ్ నేతృత్వంలో సోమవారం రాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఆదాయం మిన్న..సౌకర్యాలు సున్నా?

• బ్రిటీష్ కాలంలో నిర్మించిన భవనంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం • కొత్తది నిర్మించాలని వినతి

ఆలమూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రతిరోజూ లక్షల్లో ఆదాయం తెచ్చిపెట్టే కార్యాలయం అది. ఎప్పుడో బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఆ భవనంలో నేటికీ రిజిస్ట్రేషన్లు కొనసాగిస్తున్నారు. ఈ భవనం మరెక్కడో కాదు. ఆలమూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పట్టిన దుస్థితి. దాదాపు వందేళ్ల క్రితం నిర్మించిన భవనంలో ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లో భూముల కొనుగోలు, అమ్మకాలు, స్థలాలు, ఇళ్ల క్రయ విక్రయాలు చేసుకోవడంతోపాటు పలు రకాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇక్కడ జరిగే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రోజూ లక్షల్లో ఆదాయం వస్తుంది. ఇంత ఆదాయం వస్తున్నప్పటికీ పురాతన భవనంలో కొట్టుమిట్టాడుతోంది. చెదలు, వర్షం నుంచి రిజిస్ట్రేషన్ పత్రాలను కాపాడుకోలేక ఎన్నో ఇబ్బందులుపడాల్సి వస్తోంది. బ్రిటీష్ కాలంలో ఆలమూరును తాలుకా కేంద్రంగా ఏర్పాటు చేసి అనేక కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన భవనంలోనే రెవెన్యూ, పోలీస్ స్టేషన్, సబ్‌ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండేవి. కాల క్రమణా పోలీస్ స్టేషన్, సబ్ ట్రెజరీ కార్యాలయాలకు నిధులు మంజూరు కావడంతో కొత్త భవనాల్లోకి మారిపోయా రు. రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు మాత్రం ఇదే భవనంలో కొనసాగుతున్నాయి. ఈ భవనాన్ని 1916లో నిర్మించారు. పైకప్పు చెడిపోవడంతో వర్షా కాలంలో విలువైన రికార్డులు పాడైపోతున్నట్టు తెలిసింది. ఇప్పటికే అనేక రికార్డులు కాలగర్భంలో కలసిపోయాయని సమాచారం. రెవెన్యూ కార్యాలయం పైకప్పునకు మరమ్మతులు చేయడంతో కొంత మేరకు రక్షణ పొందింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పైకప్పులకు మాత్రం టార్పాలిన్‌తో రక్షణ కల్పిస్తున్నారు. దీంతో వర్షాకాలంలో రికార్డులు పాడవడం లేదని తెలిసింది. ఈ కార్యాలయంలో ఆలమూరుతోపాటు కపిలేశ్వరపురం మండలాలకు చెందిన భూములు, స్థలాలు, ఇళ్లతోపాటు పలు రకాల రిజిస్ట్రేషన్ ఇక్కడే జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యాలయాలకు రూ.లక్షలు ఖర్చు చేసి భవంతులు నిర్మిస్తున్నారు. ఇక్కడున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి మాత్రం మోక్షం కలగడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.


శిథిలావస్థలో ఉన్న ఆలమూరు సబ్ రిజిస్ట్రార్ భవనం


కిక్ బాక్సింగ్ క్రీడాకారిణికి ఆర్థిక సాయం అందిస్తున్న సత్యం

కిక్ బాక్సింగ్ క్రీడాకారిణికి ఆర్థికసాయం

ద్రాక్షారామ, మార్చి 11(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురానికి చెందిన కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి వడ్డాది నళినికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరపున మంగళవారం ఆర్థికసాయం అందించారు. కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి నళిని అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైంది. దీంతో పోటీలకు సంబంధించి ఫీజులో 20 శాతం రాయితీని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా అందించారు. అంతర్జాతీయ పోటీలకు సిద్ధం అవుతున్న ఆమెను ఆయన అభినందించారు.


ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

రావులపాలెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మాజీ ప్రొఫెసర్ హాజరై పలు అంశాలపై మాట్లాడారు. వార్షికోత్సవంలో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

ఆత్రేయపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు ఏవో మహేష్ తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్, ట్రాక్టర్‌తో ఉపయోగించే పనిముట్లు, రోటవేటర్, పవర్ వీడర్, పవర్ టిల్లర్, కృషి ట్రాక్టర్ వంటివి రాయితీపై అందిస్తామన్నారు. సొంత భూమి ఉన్న రైతుకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, కౌలు రైతులకు ఇది వర్తించదని ఆయన తెలిపారు. కావల్సిన రైతులు వెబ్ ల్యాండ్‌లో భూమి వివరాలు నమోదై ఉండాలని, లేని పక్షంలో ఈ పథకానికి అర్హులు కారని ఆయన తెలిపారు.

కల్యాణ వేదికను పరిశీలించిన అధికారులు


వాడపల్లిలో స్వామివారి కల్యాణ వేదికను పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

ఆత్రేయపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు వచ్చేనెల 7 నుంచి 13 వరకు జరగనున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి కల్యాణోత్సవాలకు రానున్నారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో శ్రీకర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో ఉత్సవాలపై మంగళవారం సమీక్షించారు. రెండవ దఫా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లపై అధికార యంత్రాంగంపై సమీక్షించనున్నారు. మంగళవారం దేవదాయ శాఖ కాకినాడ డిప్యూటీ కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు, కోనసీమ జిల్లా దేవదాయ శాఖాధికారి వి.సత్యనారాయణ తొలుత స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వేద ఆశీర్వచనం తీసుకుని స్వామివారి చిత్రపటం స్వీకరించారు. ఆ తర్వాత శ్రీనివాస ప్రాంగణంలో స్వామివారి కల్యాణ వేదిక ప్రాంతాన్ని పర్యవేక్షించారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి కల్యాణోత్సవ ఏర్పాట్లను తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను చురుకుగా నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి


ఆలమూరులో జరిగిన సమావేశంలో శ్రీనివాస్

ఆలమూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఆవిర్భావ సభ నియోజకవర్గ సమన్వయకర్త సుంకర కృష్ణవేణి అన్నారు. ఆలమూరు మండ లం పినపళ్ల, చెముడులంక గ్రామాల్లో ఆవి ర్భావ సభ ఏర్పాట్లపై కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో వ్యవహరించి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశాల్లో నాయకులు సూరపురెడ్డి సత్య, ఎస్.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో 14న నిర్వహిస్తున్న జనసేన ఆవిర్భావ వేడుకలకు తరలి రావాలని జనసేన నాయకుడు చిక్కాల దొరబాబు అన్నారు. రామచంద్రపురం పట్టణంలో జనసేన ఆవిర్భావ దినోత్సవ వాల్ పోస్టర్‌ను జనసేన కార్యకర్తలతో కలసి ఆవిష్కరించారు. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి జనసైనికులు, వీర మహిళలు, యువత పాల్గొనాలని కోరారు.


తడిపొడి చెత్తలపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

తడి,పొడి చెత్తపై అవగాహన

కె.గంగవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరణకు వచ్చినప్పుడు తడి,పొడి చెత్తలను వేరుచేసి వేయాలని ఈవోపీఆర్‌డి కెఎస్ గౌరీకుమారి, సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం గ్రామంలో చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణపై సూచనలు చేస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి ఈవోపీఆర్‌డీ గౌరీకుమారి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై చెత్త వేసిన వారికి జరిమానాలు


చెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ పట్టణమే లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్ పలు చర్యలు తీసుకుంటున్నారు. పారిశుధ్యం మెరు గునకు ప్రజలు సహకరించాలని ఆయన ప్రతి రోజూ వార్డుల్లో పర్యటిస్తూ చైతన్యపరుస్తున్నా రు. మంగళవారం కమిషనర్ రంగారావు సిబ్బందితో కలిసి 24వ వార్డులోని సైదుల్‌పేటలో పర్యటించారు. తడిపొడి చెత్తను వేరు చేయటం, సేంద్రియ ఎరువు తయారీపై ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. పట్టణంలో ఇంటి పన్నుల వసూళ్లకు నియమించిన బృం దాలతో ఆయన సమీక్ష జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


రావులపాలెం జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న బంధువులు, గ్రామస్తులు

బాధిత కుటుంబానికి న్యాయం కోరుతూ నిరసన

రావులపాలెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ జాతీయ రహదారిపై మంగళవారం వారు ఆందోళన జరిపారు. ఆత్రేయపురం మండలం కట్టుంగకు చెందిన వందే విజయకుమారి(45) సోమవారం భర్త రమేష్‌బాబుతో కలిసి రావులపాలెం వైపు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా ఊబలంక వద్ద టిప్పర్ లారీ ఢీకొనడంతో ఆమె మృతి చెందిన సంఘటన తెలిసిందే. దీంతో పోలీస్‌స్టేషన్ ఎదురుగా మృతురాలి బంధువులు, గ్రామస్తులు ఆమె కుటుంబానికి న్యాయం చేయాలంటూ నిరసన తెలిపారు. దీంతో పెద్దఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు న్యాయం జరిగేలా చూస్తామని వారితో చర్చలు జరపడంతో నిరసన విరమించారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు.


అనాథ పిల్లలకు నిత్యావసర వస్తువులు అందించిన దృశ్యం

అనాథ పిల్లలకు నిత్యావసర వస్తువుల పంపిణీ

మండపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను పోగొట్టుకుని ఏలేశ్వరం మండలం పెదశంకర్లపూడి బేతస్త ఆశ్రమంలో ఉంటున్న 20 మంది పిల్లలకు మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మంచాలు, నిత్యావసర వస్తువులను అందించారు. బేతస్త మందిర నిర్వాహకుడు కిషోర్ సేవలను గుర్తించి కళాశాలలో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్ వారా వెంకటరావు కుటుంబ సభ్యులు నిత్యావసర వస్తువులు, పుస్తకాలు అందించారని కళాశాల ప్రిన్సిపాల్ కె.టి.టి.వి.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కిరణ్‌కుమార్, గోపాలకృష్ణ, మధుకుమార్, అభినయ్, రామకృష్ణ అనపర్తి సర్పంచ్ వారా కుమారి పాల్గొన్నారు.

అయోడిన్ లోపం నష్టాలపై అవగాహన

మండపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధులపై ఆశా వర్కర్లకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఢిల్లీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సహకారంతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం కామాక్షి కల్యాణ మండపంలో జరిగింది. మండపేట, రామ చంద్రపురం పరిధిలో వున్న ఆశవర్కర్లతోపాటు, కపిలేశ్వరపురం మండపేట మండలంలో పనిచేస్తున్న ఆశవర్కర్లు హాజరయ్యారు. ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ శ్రావణి అయోడిన్ లోపం వల్ల కలిగే పరిణామాలపై తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణలో రామచంద్రపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సత్యవేణి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.


ఆశావర్కర్లకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మద్యం విక్రయాలపై కేసు నమోదు

కపిలేశ్వరపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై అంగర పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం వడ్లమూరు గ్రామానికి చెందిన కొల్లాటి సురేష్ గ్రామ శివారులో పది మద్యం బాటిళ్లను విక్రయిస్తుండగా సోమవారం రాత్రి సిబ్బందితో దాడి జరిపి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా మద్యం అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

14న విజయదుర్గా పీఠంలో పౌర్ణమి పూజలు

రాయవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో 14న ఫాల్గుణ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, శ్రీదేవి భూదేవి సమేత విజయ వేంకటేశ్వర స్వామికి తులసిదళ అర్చనలు, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు జరుగుతాయన్నారు.

ఫీజు రీఎంబర్స్‌మెంటు బకాయిలు జగన్‌కు గుర్తు లేదా?

ద్రాక్షారామ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఫీజు రీఎంబర్స్‌మెంటు బకాయిలు పెట్టిన మాజీ సీఎం జగన్‌కు పదవిలో ఉండగా అది గుర్తులేదా అని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రిష్వంత్‌రాయ్ పేర్కొన్నారు. 2014-19లో తెలుగుదేశం ప్రభుత్వం ఏటా 16 లక్షల మందికి ఫీజు రీఎంబర్స్‌మెంటు చెల్లిస్తే జగన్ తన పాలనలో కేవలం 9 లక్షల మందికి వాటిని చెల్లించారన్నారు. కూటమి ప్రభుత్వం రూ.788 కోట్ల బకాయిలు ఇప్పటికే చెల్లించారన్నారు. వివిధ కళాశాలల్లో నిలిచిపోయిన 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకుందన్నారు. వైసీపీ చేపట్టిన యువత పోరు బూటకమని ప్రజలు గమనిస్తున్నారని రిష్వంత్‌రాయ్ అన్నారు.


గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

పశువులకు టీకాలు

కె.గంగవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి.ఎస్.మూర్తి అన్నారు. మంగళవారం గంగవరం, సత్యవాడ గ్రామాల్లో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. సత్యవాడలో పామర్రు పశు వైద్యశాల వైద్యాధికారిణి ఎం.బిందు, గంగవరంలో పశు వైద్యాధికారిణి భావన జ్యోతి ఆధ్వర్యంలో సిబ్బంది 250 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.


తడి,పొడి చెత్త వేరుచేసే విధానాన్ని వివరిస్తున్న ఈవోపీఆర్డీ మోహన్, కార్యదర్శి శివచక్రవర్తి

చెత్తతో సంపద సృష్టించాలి

కపిలేశ్వరపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వచ్చే తడి, పొడి చెత్తతో సంపద సృష్టించాలని ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ ఆర్.మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వల్లూరు, కాలేరు, తదితర గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని పంచాయతీ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, యానిమేటర్లు, పారిశుధ్య సిబ్బంది సహకారంతో అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. తడిచెత్తను, హానికరమైన చెత్తను వేరుచేసి ఇచ్చేలా ప్రజలందరికీ అవగాహన కల్పించడంతో పాటు వేరుచేసిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టుగా చేసే విధానాన్ని వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.